## అధ్యాయము 4

# ఆదాము హవ్వల కుటుంబము

ఆదికాండము 2:7–3:24 ఏదెను తోటలో ఉన్న ఆదాము హవ్వల కథను చెబుతుంది. వారు దేవుని ప్రపంచంలో ఆయన నిబంధనలను అనుసరించి జీవించుటలో విఫలమై తోటలో నుండి వెళ్ళగొట్టబడిరి, కాబట్టి 4:1–24 భూలోక పరదైశు వెలుపల మొదటి దంపతుల యొక్క అనుభవాన్ని వివరిస్తుంది. హవ్వ ఇద్దరు కుమారులకు జన్మనిచ్చెను: కయీను మరియు హేబెలు. వారి జీవితాల ద్వారా కూడ, పాపము యొక్క విషాద ఫలం మరియు నాశనకరమైన పరిణామాలు మరొకసారి ఆదాము హవ్వల గృహంలో మనం చూడవచ్చు: చిన్న కుమారుడు తన అన్న ద్వారా హతము చేయబడెను.

సమాజంలోనికి పాపం ఎలా ప్రవేశించెనో, చివరికి కయీను యొక్క వారసులలో ఒకరు హత్యను గూర్చి గొప్పలు చెబుతూ దానిని వాస్తవంగా గౌరవ చిహ్నంగా ధరించుకొనినంతవరకు, ఆదికాండము యొక్క రచయిత దానిని నివేదించెను. చివరిగా, అధ్యాయం యొక్క చివరిలోని (4:25, 26), వాక్యభాగంలో ఒక ఆశాకిరణం కనిపిస్తుంది. ఆదాము హవ్వలకు మూడవ శిశువు జన్మించెను; మరియు అతని ద్వారా, మనుష్యులు దేవుని నామమున ప్రార్థించుట మొదలుపెట్టిరి.

## తోట వెలుపల (4:1–16)

### కయీను మరియు హేబెలు యొక్క జననం (4:1, 2)

**1ఆదాము తన భార్యయైన హవ్వను కూడినప్పుడు ఆమె గర్భవతియై కయీనును కని – యెహోవా దయవలన నేనొక మనుష్యుని సంపాదించు కొన్నాననెను. 2తరువాత ఆమె అతని తమ్ముడగు హేబెలును కనెను. హేబెలు గొర్రెల కాపరి, కయీను భూమిని సేద్యపరచువాడు.**

**వచనం 1.** ఆదాము తన భార్యయైన హవ్వను కూడినప్పుడు అని చెప్పుచు అధ్యాయం ఆరంభమవుతుంది. వాక్యభాగం అక్షరార్థంగా ఆదాము తన భార్యను

"ఎరిగెను" יָדַע (*yada'*) అని చెబుతుంది (KJV చూడండి). ఆదికాండములో లైంగిక సంబంధాలను వివరించుటకు ఈ హెబ్రీ పదము సామాన్య సభ్యోక్తిగా వాడబడెను (4:1, 17, 25; 19:8; 24:16; 38:26). అతడు ఆమెను మరింత సన్నిహితమైన మార్గం ద్వారా తెలుసుకొనెను అని దీని అర్థం.

ఆమె గర్భవతియై ఒక కుమారుని కనెను, అతనిని కయీను קַיִן (*Qayin*) అని పిలచెను. "కయీను" అను పేరు యొక్క మూలము ఏమిటో స్పష్టత లేదు, మరియు దాని శబ్దలక్షణము యొక్క మూలార్థం קין (*qyn*), "నకలు" తో ఎటువంటి సంబంధం లేకపోవచ్చు. దానికి బదులుగా, 4:1– పదకేళిలో సమానమైన శబ్దమును ఉపయోగించి – దానిని, קָנָה (*qanah*), "స్వాధీనపరచుకొనుట" లేక "బయటకు తెచ్చుట" అని అర్థమిచ్చు మరొక మూలముతో జతపరుస్తుంది.[1]

కయీను యొక్క జననమునకు హవ్వ యొక్క స్పందన NASBలో ఈ విధంగా అనువదించబడెను: యెహోవా సహాయంతో నేను ఒక మగశిశువును పొందితిని. "మగశిశువు" אִישׁ (*'ish*) అని అనువదించబడిన హెబ్రీ పదం సాధారణంగా "నరుడు" అని అనువదించబడుతుంది (KJV; NRSV; NIV; ESV చూడండి). "కుమారుడు" లేక "శిశువు" అను పదాలకు బదులుగా హవ్వ ఈ పదమును ఎందుకు ఉపయోగించెను? ఆమె "నరుని"లో אִישׁ (*'ish*) నుండి తియ్యబడి "నారి" אִשָּׁה (*'ishshah*; 2:23) అని పిలువబడిన దాని ఆధారంగా ఆమె పదకేళి చేసివుండవచ్చు. ఇప్పుడు, ఆమె ఒక స్త్రీగా (*'ishshah*), ఒక పురుషునికి (*'ish*) జన్మనిచ్చింది.[2] ఒకరిపై ఒకరు ఆధారపడియున్న ఈ అనుబంధాన్ని గూర్చి వ్రాస్తూ పౌలు, "స్త్రీ పురుషునినుండి ఏలాగు కలిగెనో ఆలాగే పురుషుడు స్త్రీ మూలముగా కలిగెను" (1 కొరింథీ 11:12; NIV) అని నివేదించుచున్నాడు.

ఈ వచనంలో అనువదించుటకు కష్టమైన పదం אֶת (*'eth*) , ఇది అనేక ఆంగ్ల అనువాదాలలో "తో" అనే విభక్తితో అన్వయించబడెను. NASBలో, "తో" అనే పదం "సహాయం" అనే పదముతో వెంబడించబడెను, మరియు ఇది హెబ్రీ మూల గ్రంథములో కనిపించదు. అరామిక్ లో పంచగ్రంథము యొక్క అత్యంత పురాతన మరియు ఖచ్చితమైన వివరణిచ్చు, Onkelos యొక్క వ్యాఖ్యానం లో, "ప్రభువు ముందు నుండి"[3] అని వ్రాయబడి, నూతన శిశువు ప్రభువు యొక్క బహుమానమని గుర్తించబడెను. మూల గ్రంథము యొక్క ఇట్టి గ్రహింపును LXX అంగీకరిస్తుంది. దానిలో διά τοῦ θεοῦ (*dia tou Theou*, "దేవుని ద్వారా") అని ఉంది, మరియు హవ్వ దేవుని నుండి శిశువును పొందెనని అది సూచిస్తుంది.

Onkelos యొక్క వ్యాఖ్యానం అనువాదం హెబ్రీ మూల వాక్యంలో చదివినప్పుడు కొంచెం వేరుగా సూచిస్తుంది: מֵאֵת (*me'eth*). ముఖ్య సమస్య ఏమిటంటే "తో" אֵת (*'eth*) అను విభక్తి యొక్క అచ్చుల బిందువులు మరియు "నుండి"– מֵ (*me*) అను పదం యొక్క హెబ్రీ అక్షరక్రమము MTలో లేవు; దానికి

బదులుగా, ప్రత్యక్ష వస్తువు యొక్క చిహ్నం కలిగిన అచ్చుల బిందువులను, లేక ముందున నామవాచకం אֶת (*'eth*) యొక్క పొందికలోని పదమును అది కలిగియున్నది. అనగా, మూల గ్రంథము అక్షరార్థంగా, "నేను ఒక నరుని పొందితిని: ప్రభువు," అని చెప్పుచున్నది. ఇందువలన హవ్వ వాగ్దానము చేయబడిన విమోచకునికి, "ప్రభువునకు," జన్మనిచ్చెనని తలంచెనని, మరియు "కయీను యొక్క జననం ద్వారా శిక్ష నుండి త్వరిత ఉపశమనం" పొందగలనని ఆలోచించెనని కొందరు పండితులు వివరిస్తారు.[4]

పాలస్తీనాకు చెందిన వ్యాఖ్యానం కూడ ఇలాంటి అవగాహననే అందిస్తుంది, హవ్వ ఇలా అనెను, "నేను ఒక నరుని పొందితిని, ప్రభువు యొక్క దూత."[5] ఆదికాండములో ప్రభువు దూత అను మాట, తన కొరకు మాట్లాడు మరియు తనకు ప్రాతినిధ్యంవహించు యెహోవాకు పర్యాయపద ముగా ఉంది, అను ఆలోచనను ఈ అనువాదం ప్రతిబింబించవచ్చు (16:7–13; 21:17–20; 22:11–18; 31:11–13; 48:15, 16).

సుమారుగా క్రీ.శ. 800లో హల్లులు ఉన్న హెబ్రీ మూల వాక్యంలో హచ్చుల బిందువులను అమర్చిన Masoretes, "తో" אֵת (*'eth*) అను విభక్తికి బదులుగా ప్రత్యక్ష వస్తువు యొక్క చిహ్నమును אֶת (*'eth*) ఖచ్చితముగా వాడారో లేదో మనకు తెలియదు. కయీను యొక్క జననం ద్వారా హవ్వకు కలిగిన ఆనంద భావమునకు స్పష్టమైన విశ్లేషణ చెయ్యలేక పోయినప్పటికీ, కయీను జననంలో ఏదో ఒక విధంగా దేవుని హస్తమున్నదని ఆమె ఖచ్చితంగా ఆలోచన చేసెను (29:31; 30:22; 33:5; 48:9; యోబు 31:15; కీర్తనలు 127:3; 139:13; యిర్మీయా 1:5 చూడండి). ఎక్కువ ఆంగ్ల అనువాదాలు హెబ్రీ మూల గ్రంథమును అన్వయించినట్లు ఆమె దృష్టిలో, ఈ నూతన శిశువు "ప్రభువు"గా (ఆయన ప్రతినిధి అను అర్థంలో), లేక "ప్రభువు యొద్ద నుండి" వచ్చినవాడు గా, "ప్రభువు ద్వారా," లేక "ప్రభువు సహాయం"తో వచ్చునవాడు అయ్యుండాలి. ఏదిఏమైనా, తన జేష్ఠ కుమారుని గూర్చి హవ్వ కలిగియున్న ఆనందము మరియు కలలు కరిగిపోతాయి, మరియు ఆ మగ–శిశువు పై ఆమె పెట్టుకున్న ఆశలు అడిఆశలవుతాయి. ఆమె బాధకు ఉపశమనానికి బదులు, తన జీవితకాలమంతా హృదయంలో నొప్పిని కలిగించు గాయమును అతడు కలిగిస్తాడు.

**వచనం 2.** కొంత కాలం తరువాత, హవ్వ [కయీను] **తమ్ముడైన హేబెలుకు జన్మనిచ్చెను.** హవ్వ యొక్క రెండవ శిశువు యొక్క జననం వాస్తవికంగా వివరించబడెను, అనగా ఆమెకు హేబెలుపై కయీను కంటే తక్కువ ఆశలు ఉన్నాయని సూచిస్తుంది. వాస్తవానికి, మొదటి కుమారుడు జన్మించినప్పుడు హవ్వ ఇచ్చిన మహిమగల వ్యాఖ్యకు భిన్నంగా, హేబెలు జన్మను గూర్చి తాను ఎలాంటి వ్యాఖ్య చెయ్యకపోవుట ఆ శిశువు వలన తనకు కలిగిన కొంత ఆశాభంగమును బయలుపరుస్తుంది: అతడు కయీను అంత అందమైనవాడు లేక

బలమైనవాడు కాడా? ఆ సందర్భంలో ఆమె మదిలో ఏమి జరిగెనో మనకు తెలియదుగాని, అతని పేరు తన జీవితములో జరుగు అరిష్టానికి ముందస్తు సూచనగా ఉండి.

"హేబెలు" הֶבֶל (*Hebel*) అను పేరుకు అర్థము "ఆవిరి," "శ్వాస," లేక "వ్యర్థం" కావచ్చు. ఈ పదము ఎక్కువగా పాత నిబంధనలో అబద్ధ దేవతల కొరకు ఉపయోగించబడెను; అది "విగ్రహాలు" అని అనువదించబడెను, మరియు అవి "వ్యర్థములు"గా ఘోషించబడెను. అది కొన్ని సార్లు తన జీవితాన్ని "వ్యర్థముగా ఫలములేకుండా" (యెష. 49:4) గడిపిన వ్యక్తిని సూచిస్తుంది. ప్రసంగి గ్రంథములో ముప్పది – ఆరు సార్లు, సమస్తమును పరీక్షించి జీవితంలో నిలచు సంతృప్తిని పొందని వ్యక్తితో ఇది పోల్చబడుతుంది.[6] సంతృప్తిలేక, సమస్తము "వ్యర్థము" లేక "నిరర్థకము" మరియు "గాలికి ప్రయాసపపడినట్టుగా" అగుపడెనని ప్రసంగి తరచుగా చెప్పుచున్నాడు (ప్రసంగి 2:11, 17 చూడండి). అయితే, హేబెలు పేరు విషయంలో, Abel తన సోదరుడైన కయీను ద్వారా కుదించబడిన అతని జీవితం యొక్క క్లుప్తతకు ముందస్తు సూచనగా ఉంది. భూమి పై హేబెలు యొక్క సమయం తాత్కాలికం – కేవలం "ఆవిరి" లేక "శ్వాస" వలె ఉంది.[7]

**హేబెలు గొర్రెల కాపరిగా వర్ణించబడెను,**[8] **మరియు కయీను భూమిని సేద్యపరచువాడు.**[9] పురాతన నాగరికతలో రెండు రకముల జీవనశైలిల మధ్య ఉన్న వర్గ పోరాటమును ఈ కథ ప్రతిబింబిస్తుందని కొందరు చెబుతారు: ఒకటి వ్యవసాయకులు మరియు స్థిరపడినవారు, మరొకటి కాపరులు మరియు సంచారకులు. ఈ కథనంలో ఎక్కడా కూడ దేవుని ద్వారా గాని లేక మానవుని ద్వారా గాని ఒక జీవన శైలి పై మరొక దానికి మొగ్గుచూపబడలేదు. కయీను మరియు హేబెలులోని తేడా వారి పనుల ఎంపికలో లేదుగాని, వారి హృదయ వైఖరిలో ఉంది.

## కయీను హేబెలుల అర్పణలు మరియు దేవుని స్పందన (4:3–7)

**³కొంతకాలమైన తరువాత కయీను పొలముపంటలో కొంత యెహోవాకు అర్పణగా తెచ్చెను. ⁴హేబెలు కూడ తన మందలో తొలుచూలున పుట్టిన వాటిలో క్రొవ్విన వాటిని కొన్ని తెచ్చెను. యెహోవా హేబెలును అతని యర్పణను లక్ష్యపెట్టెను; ⁵కయీనును అతని యర్పణను ఆయన లక్ష్యపెట్టలేదు. కాబట్టి కయీనుకు మిక్కిలి కోపము వచ్చి అతడు తన ముఖము చిన్నబుచ్చుకొనగా ⁶యెహోవా కయీనుతో – నీకు కోపమేల? ముఖము చిన్నబుచ్చుకొని యున్నావేమి? ⁷నీవు సత్క్రియ చేసినయెడల తలనెత్తుకొనవా? సత్క్రియ చేయనియెడల వాకిట పాపము పొంచియుండును; నీ యెడల దానికి వాంఛ కలుగును నీవు దానిని ఏలుదువనెను.**

**వచనాలు 3–5. సమయం** గడచిన కొలది, కయీను మరియు హేబెలు వారి

వారి పనులలో సంపన్నులైరి. ఈ వాక్యభాగం ఇద్దరి సోదరులను ఆరాధన సందర్భంలో వర్ణిస్తుంది. ఇద్దరి యవ్వనుల మధ్య ముఖ్యమైన బేధం వారు దేవునికి అర్పించిన వాటిలో కనిపిస్తుందని కొందరు ప్రతిపాదించిరి: **కయీను పొలము పంటను ... అర్పణగా తెచ్చెను** (ధాన్యం మరియు/లేక కూరగాయల అర్పణలు), **మరియు హేబెలు ... తన మందలో తొలుచూలున పుట్టిన వాటిలో క్రొవ్విన వాటిని అర్పణగా తెచ్చెను.** ఆ సమయంలో దేవుడు రెంటిలో ఒకదాని వైపు మొగ్గుచూపుటను గూర్చి వాక్యభాగం నిశబ్దంగా ఉంది. ప్రతివాడును దేవునికి అర్పణ מִנְחָה (*minchah*) తెచ్చెనని మాత్రమే ఈ వివరణ చెప్తుంది. తరువాత యూదులు చరిత్రలో ఈ పదం ప్రధానంగా తగిన పిండి లేక ధాన్య అర్పణలను వివరించుటకు ఉపయోగించబడెనుగాని (లేవీ. 2:1–3, 14–16),[10] దానిలో జంతువుల బలి కూడ భాగమైయుండవచ్చు (1 సమూ. 2:17).

**యెహోవా హేబెలును అతని యర్పణను లక్ష్యపెట్టెను; కయీనును అతని యర్పణను ఆయన లక్ష్యపెట్టలేదు.** "తన మందలో తొలుచూలున పుట్టిన వాటిలో క్రొవ్విన వాటిని" అను మాట దేవునికి కయీను అర్పణ కంటే హేబెలు అర్పణ ఎందుకు విలువైనదో గ్రహించుటకు ఒక తాళపుచెవి వంటిది. మోషే ధర్మశాస్త్రము ప్రకారం, పంట యొక్క ప్రథమ ఫలాలు (నిర్గమ. 23:16–19; 34:22–26; లేవీ. 2:14), జంతువుల తొలుచూలు (నిర్గమ. 13:11–13; 22:29, 30; 34:19, 20), మరియు వాటి క్రొవ్విన భాగములు (నిర్గమ. 29:13; లేవీ. 3:3–5; 4:8–10; 7:23–25) ఒక ప్రత్యేకమైన రీతిలో దేవునికి చెందుతాయి. చరిత్రలో అట్టి ఆరంభ కాలములో దేవుడు ఇలాంటి హెచ్చరికలు మానవులకు ఇచ్చెనో లేదో మనం నిర్ధారించలేము. అయితే, హేబెలు తన మందపై దేవుని ఆశీర్వాదమును అభినందించి, తనకున్న వాటిలో ప్రథమ మరియు ఉత్తమైనవాటిని దేవునికి ఇచ్చుటలో కృతజ్ఞుడాయెను. కయీను వైరభావము కలిగిన వైకరితో, ప్రథమ మరియు ఉత్తమమైనవాటిని తన యొద్ద ఉంచుకొని మిగిలినవాటిని దేవుని యొద్దకు తెచ్చెను.

దేవుడు హేబెలు అర్పణ ఎందుకు అంగీకరించెనో మరియు కయీను అర్పణ ఎందుకు తిరస్కరించెనో ఆదికాండము వివరణలో ఇవ్వబడలేదు. ఇక్కడి వాక్యభాగం క్లుప్తముగాను మరియు తక్కువ వివరణ యిచ్చెను; అయితే, దేవుని పట్ల, వారికి వారి పట్ల, మరియు వారికున్నవాటి పట్ల వారి వైఖరి చాలా వేరుగా ఉందని అనిపిస్తుంది. ఇలా చెప్పుచు హెబ్రీ పత్రిక రచయిత దీనిని వక్కాణించెను, "విశ్వాసమునుబట్టి హేబెలు కయీనుకంటె శ్రేష్టమైన బలి దేవునికి అర్పించెను. దేవుడతని అర్పణలను గూర్చి సాక్ష్యమిచ్చినప్పుడు అతడు ఆ విశ్వాసమునుబట్టి నీతిమంతుడని సాక్ష్యము పొందెను. అతడు మృతినొందియు ఆ విశ్వాసముద్వారా మాటలాడుచున్నాడు" (హెబ్రీ. 11:4).

దేవుడు "హేబెలును అతని యర్పణను లక్ష్యపెట్టెను" "కయీనును అతని

యర్పణను" ఆయన "లక్ష్యపెట్టలేదు," అను ప్రతిపాదన నుండి మనం అనేక సత్యములను వివేచించవచ్చు. (1) ఇద్దరు సోదరులు దేవుని నమ్మి ఆయనను ఆరాధించినప్పటికీ, కయీను యొద్ద లేని విశ్వాస నాణ్యత (దేవుని పట్ల సమర్పణ) హేబెలులో ఉండెను. (2) ఇద్దరు సోదరులు దేవునికి అర్పణలు చెల్లించినప్పటికీ, ప్రథమ మరియు ఉత్తమైనవాటిని ఇచ్చి దేవుని మహిమపరచునట్లు చేసిన హేబెలు విశ్వాసము, ప్రథమ మరియు ఉత్తమైనవాటిని తన కొరకు ఉంచుకున్న కయీను విశ్వాసంకంటె పూర్తిగా భిన్నముగా ఉండెను. కయీను తన్నుతాను ఘనపరచుకొనినయెడల, అతడు నిజముగా దేవుని మహిమపరచుటలేదు. మానవులవలె కాక దేవుడు మనుష్యుల బాహ్య క్రియలె కాకుండా మనుష్యుల హృదయాలలో ఉన్న ప్రవర్తనను, ఆరాధనలో వారి యొక్క ఉద్దేశాలను గ్రహిస్తాడు. లేఖనములలో తరువాత, దేవునికి యిష్టులుగా ఉండగోరినవారందరి నుండి దేవుడు విధేయతను మరియు దీన మనస్సును ఆశిస్తున్నాడని చెప్పబడెను (1 సమూ. 15:22; హోషేయా 6:6; మీకా 6:8; మత్తయి 5:24; 23:23 చూడండి).

కయీను యొక్క కోపం తన హృదయం యొక్క నిజమైన వైఖరిని గూర్చి కొంత తెలియజేస్తుంది. వాస్తవానికి, **కయీనుకు మిక్కిలి కోపము వచ్చెనని** వాక్యభాగము చెప్పుచున్నది, మరియు "మిక్కిలి" מְאֹד (*m*$^{e}$*'od*) అను పదం భావముల యొక్క తీవ్రతను తెలియజేస్తుంది; కయీను అత్యంత కోపముతో మండెను. ఇలాంటి హెబ్రీ నిర్మాణమే ఆదికాండము 34:7లో, తమ సహోదరి అయిన దీనా షెకెము చేతులలో లైంగిక అత్యాచారమునకు గురైన సంగతిని వినిన తరువాత యాకోబు కుమారులలో రగిలిన కోపమును వివరించుటలో చూడవచ్చు. ఇట్టి కోపము, నియంత్రించబడనియెడల, ఈ రెండు పర్యాయాలలో జరిగినట్లు, హత్యకు దారితీస్తుంది.

కయీను కోపమునకు తోడు, అతని ముఖము చిన్నబుచ్చుకొనెను అని వాక్యము చెప్పుచున్నది, దాని అక్షరార్థ అనువాదము "తన ముఖము పడిపోయెను," లేక దుఃఖము మరియు నిరాశతో తన ముఖము చిన్నబోయెను అని అర్థం (యోబు 29:24 చూడండి). ఇట్టి పరిస్థితిలో, కయీను భయంకరమైన మానసిక స్థితిలో ఉండెను, ఇది దేవునికి బాగుగా తెలియును.

క్రొత్త నిబంధనలో, తన సోహోదరుని ద్వేషించి హత్య చేసెను గనుక కయీను "దుష్టుని సంబంధి" (దెయ్యం) అని చెప్పబడెను. అట్టి క్రియకు కారణం కయీను "క్రియలు చెడ్డవియు తన సహోదరుని క్రియలు నీతిగలవియునై యుండెను" (1 యోహాను 3:11–15). కయీను పాపమునకు హత్య ఆరంభము కాదు; "తన క్రియలు చెడ్డవి" గనుక అతడు హేబెలును హత్యచేసెను. ఆదికాండము 4:8లో వివరించబడిన సన్నివేశాలకు ముందు తన సహోదరుని పట్ల ఈర్ష్య మరియు ద్వేషము ఉండెను. కాబట్టి, దేవుడు హేబెలు అర్పణను అంగీకరించుట మరియు

కయీను అర్పణను తిరస్కరించుట, తన హృదయంలో కొంత కాలంగా రగులుతున్న కోపపు మంటను రగిలించిన చివరి నిప్పురవ్వగా మారెను. అది తన సహోదరుని హత్యకు దారితీసెను.

**వచనం 6. యెహోవా కయీనుతో – నీకు కోపమేల? ముఖము చిన్నబుచ్చుకొని యున్నావేమి?** దేవుడు కయీనును అడిగిన ప్రశ్నలలో సహనం మరియు ప్రేమను కనుపరచెను, మరియు 3:9 – 13లో ఆయన ఆదాము హవ్వలను అడిగినట్లే కయీనును కూడ ప్రశ్నించెను. మరొకసారి, ప్రభువు అడిగిన ప్రశ్నల యొక్క ఉద్దేశం సమాచారం పొందుటకు కాదు, ఎందుకంటే కయీను ఎందుకు "కోపముగా" ఉండెనో మరియు తన "ముఖము ఎందుకు చిన్నబోయెనో" ఆయనకు స్పష్టముగా తెలుసు. కయీను తన హృదయ వైఖరిని పరీక్షించుకోవాలని దేవుడు కోరెను. తన అపరాధమును ఒప్పుకొనుట పశ్చాత్తపమునకు నడిపించియుండవచ్చు. తన తమ్ముని పట్ల అన్నకు ఉన్న ఈర్ష్యను మరియు దేవుని పట్ల ఉన్న కోపమును అదుపుచేయనియెడల, అది మరింత గంభీరమైన పాపమైన తన సహోదరుని హత్యకు నడుపునని దేవునికి ఖచ్చితముగా తెలుసు. అయితే, తన తల్లిదండ్రుల వలెనె కయీనుకు కూడ జరిగెను: పాపము ఒప్పుకొనుట లేక మారుమనస్సు కలుగలేదు; కోపముతో ఉన్న కయీను నిశబ్దముగా అలిగి దేవుని ప్రశ్నలకు జవాబు ఇవ్వలేదు.

**వచనం 7.** ఈ వచనం అనేక కష్టమైన వ్యాకరణ ప్రశ్నలను ప్రవేశపెడుతుంది. సుమారుగా క్రీ.పూ. 250 నుండే, LXX యొక్క అనువాదంతో, కొందరు మూల గ్రంథములో మార్పులు చేసి దానిని మరలా వ్రాయుటకు ప్రయత్నించారు; మరియు ఈ అలవాటు నేటికీ కొనసాగుతుంది. ఈ సమస్య యొక్క సాంకేతికాలను చర్చించుట ఈ వ్యాఖ్యానం యొక్క పరిధికి మించినది. కాబట్టి, కయీనుతో దేవుడు ప్రతిపాదన NASBలో వాస్తవిక రచయిత యొక్క తలంపుకు అతి దగ్గరగా అనువదించబడినది అని చెప్పవచ్చు: **"నీవు సత్క్రియ చేసినయెడల, నీ ముఖము పైకెత్తబడదా?"** "నీ ముఖము" అను మాట 7వ వచనంలో లేనప్పటికీ, అది భావార్థమై యుందనునది ఉత్తమమనిపిస్తుంది, ఎందుకంటే 5 మరియు 6 వచనాలలో కయీను యొక్క చిన్నబోయిన ముఖమును ఇది తలక్రిందులు చేస్తుంది. ఒకవేళ కయీను సత్క్రియచేసి మంచి వైఖరి కలిగియున్నయెడల, అతని ముఖము ఎత్తబడును, మరియు ఇది అవమానము మరియు నింద లేకుండా దేవుని ఎదుట మంచి మనసాక్షితో నిలబడుటతో అనుబంధం కలిగియుంది.

పాపమును గూర్చి దేవుడు కయీను హెచ్చరించెను, మరియు అది వాకిట పొంచియుండి, తన పై దాడిచేయుటకు సిద్ధముగా ఉన్నట్లుగా వ్యక్తీకరించబడెను. "పొంచియుండుట" רָבַץ (*rabats*),[11] లేక "దాగియుండుట" (NRSV), తన ఆహారము పై దూకి దానిని చీల్చుటకు ముందు ఒక క్రురమృగం ఇదే చేస్తుంది. పాపము తనపై వాంఛ కలిగియున్నను కయీను దానిని ఎదురించవలసియుంది.

అతడు దానిని ఏలవలెనని దేవుడు ఆయనను హెచ్చరించెను. కయీను తన తమ్ముని హత్య కొరకు ముందుగా యేర్పరచబడినవాడు కాడు, ఏలయనగా తాను నడచుచున్న మార్గములో అతను కొనసాగవలెనో లేదో నిర్ణయించుటకు అతనికి స్వేచ్ఛా చిత్తము కలదు. అతని యొద్ద వేరొక దారి లేనంతగా అతడు నైతికంగా హీనమైపోలేదు లేక వారసత్వముగా పొందినది లేక వాస్తవమైన పాప బంధకములో చిక్కుకోలేదు. అందుకు భిన్నంగా, అతడు రెంటిలో నొకదాని నెంచుకొనుటను ఎదుర్కొన్నాడు మరియు సరైనది ఎన్నుకొనుట అతని బాధ్యత: అవిధేయతతో ఉండి దేవుని పట్ల మరియు తన సోదరుని పట్ల చెడ్డ వైఖరి కలిగియుండుటకు బదులుగా అతడు దేవునికి హృదయపూర్వక విధేయత చూపియుండవచ్చు. "నీవు సత్క్రియ చేసినయెడల ... ," అని దేవుడు చెప్పిన మాట, కయీనుకు మంచిగా స్పందించు అవకాశం లేకపోతే అర్థరహితంగా ఉండేది. అంతేగాక, పాపమును ఎదురించుటకు కయీను యొక్క బాధ్యత దేవుడిచ్చిన ఆజ్ఞలోని ఆరంభంలో ఉపయోగించిన బలమైన సర్వనామంలో స్పష్టమవుతుంది. "... నీవు, నీవు దానిని ఏలుదువు," అని హెబ్రీలో అక్షరార్థంగా చెప్పబడెను.

## కయీను తన తమ్ముడైన హేబెలును హతమార్చుట (4:8–16)

**[8]కయీను తన తమ్ముడైన హేబెలుతో మాటలాడెను. వారు పొలములో ఉన్నప్పుడు కయీను తన తమ్ముడైన హేబెలు మీద పడి అతనిని చంపెను.
[9]యెహోవా – నీ తమ్ముడైన హేబెలు ఎక్కడనున్నాడని కయీను నడగగా అతడు – నేనెరుగను; నా తమ్మునికి నేను కావలివాడనా అనెను. [10]అప్పుడాయన – నీవు చేసినపని యేమిటి? నీ తమ్ముని రక్తము యొక్క స్వరము నేలలోనుండి నాకు మొరపెట్టుచున్నది. [11]కావున నీ తమ్ముని రక్తమును నీ చేతిలోనుండి పుచ్చుకొనుటకు నోరు తెరచిన యీ నేలమీద ఉండకుండ, నీవు శపింపబడినవాడవు; [12]నీవు నేలను సేద్యపరచు చున్నప్పుడు అది తన సారమును ఇకమీదట నీకియ్యదు; నీవు భూమిమీద దిగులుపడుచు దేశదిమ్మరివై యుందువనెను. [13]అందుకు కయీను – నా దోషశిక్ష నేను భరించలేనంత గొప్పది.
[14]నేడు ఈ ప్రదేశము నుండి నన్ను వెళ్లగొట్టితివి; నీ సన్నిధికి రాకుండ వెలివేయబడి దిగులుపడుచు భూమిమీద దేశదిమ్మరినైయుందును. కావున నన్ను కనుగొనువాడెవడో వాడు నన్ను చంపునని యెహోవాతో అనెను. [15]అందుకు యెహోవా అతనితో – కాబట్టి యెవడైనను కయీనును చంపినయెడల వానికి ప్రతిదండన యేడంతలు కలుగుననెను. మరియు ఎవడైనను కయీనును కనుగొని అతనిని చంపకయుండునట్లు యెహోవా అతనికి ఒక గురుతు వేసెను. [16]అప్పుడు కయీను యెహోవా సన్నిధిలోనుండి బయలుదేరివెళ్లి ఏదెనుకు తూర్పుదిక్కున నోదు దేశములో కాపురముండెను.**

**వచనం 8.** దేవుడు హెచ్చరించినప్పటికీ, తనలో ఉన్న ద్వేషము మరింత పాపములోనికి నడుపుటకు కయీను అనుమతించెను. కయీను యొక్క అగ్ని వంటి నిగ్రహం మరియు తన సోదరుని అర్పణ ఎందుకు అంగీకరించబడెనో మరియు తన అర్పణ ఎందుకు తిరస్కరించబడెనో అని దేవుడిచ్చిన వివరణను అంగీకరించుటలో విఫలమగుటను చూస్తే, అతడు కోపోద్రిక్తుడై స్పందించునంత ఈర్ష్యతో నిండియుండవచ్చు అనిపిస్తుంది.

**కయీను హేబెలుతో మాటలాడెను** అని చెప్పుచు 8వ వచనం ఆరంభమవుతుంది. కయీను హేబెలుకు ఏమి చెప్పెనో హెబ్రీ మూల వాక్యము సూచించుటలేదు. LXX మరియు ఇతర పురాతన వెర్షన్ల ఆధారంగా "పొలమునకు వెళ్ళుదము రమ్ము" అని చెప్పియుండవచ్చని NIV జోడించింది; అయితే ఈ పదాలు కేవలం ఊహించి చెప్పినవి మాత్రమే. కయీను హేబెలును పొలములోనికి వచ్చునట్లు లయపరచెనో లేక వాగ్వాదం ఇంటిలో ఆరంభమై పొలములో కూడ కొనసాగెనో మనకు చెప్పబడలేదు. కయీను తన తమ్ముడైన హేబెలు మీద పడి అతనిని చంపెను అని మాత్రమే వాక్యం చెప్పుచున్నది. "చంపుట"కు హెబ్రీ పదము הָרַג (*harag*), షిమ్యోను మరియు లేవీ షెకెము మనుష్యులను చంపిన సందర్భంలో (ఆది. 34:25, 26), మరియు యెజెబెలు యెహోవా ప్రవక్తలను చంపిన సందర్భంలో (1 రాజులు 18:13) ఉపయోగించినట్లు, ఈ పదం సామాన్యంగా ఘోరంగా కావాలని చేసిన హత్యను వివరించుటకు ఉపయోగించబడెను.

**వచనం 9.** మరొకసారి **యెహోవా, కయీనును** ప్రశ్నించెను: **"నీ తమ్ముడైన హేబెలు ఎక్కడ?"** ఇంతకు ముందులానే ఈ ప్రశ్న కూడ అలంకార రూపంలో ఉన్నది మరియు సమాచారం పొందాలనే ఉద్దేశముతో అడిగినది కాదు; అన్నలో స్వపరీక్షకు అవకాశం కలిగించి అతడు ఎలాంటి వ్యక్తిగా మారెనో అతడు చూచుకొనునట్లు చేయుటకు ఇది అడగబడెను. దైవిక దుఃఖమునకు మరియు పశ్చాతాపమునకు తన హృదయంలో చోటు లేదా? లేదని అనిపిస్తుంది, ఎందుకంటే కయీను తిరస్కరణతో కూడిన వ్యంగ్యముతో స్పందించెను: "నేనెరుగను; నా తమ్మునికి నేను కావలివాడనా?" ఆదాము, నెపమును బదిలీచేయుటకు ప్రయత్నించి, అయిష్టంగానే పాపమును ఒప్పుకొనెను. అయితే కయీను అబద్ధమాడుట ద్వారా తన అపరాధమునకు జోడించి, దేవుని ప్రశ్నను తప్పించుకొనుటకు ప్రయత్నించుచు తన సహోదరుని హత్యకు బాధ్యతను నిరాకరిస్తూ తన సొంత ప్రశ్నను అడిగెను: "నా తమ్మునికి నేను కావలివాడనా?"

"కాదు" అను జవాబును ఆశిస్తు కయీను కూడ అలంకార రూప ప్రశ్నను అడిగెను. హేబెలును గూర్చి ప్రశ్నించినప్పుడు అతడు చూపిన చిరాకు అతని పట్ల తనకు ఉన్న ద్వేషం మరియు ఏహ్యాభావమునకు రుజువుగా ఉంది. "కావలివాడు" שָׁמַר (*shamar*) అను పదం ఉపయోగించుట ద్వారా, తన తమ్ముని పట్ల తనకు

ఉన్న అక్కర లేక బాధ్యతను కయీను నిరాకరించెను. "కావలికాయుట" అను భావము లేఖనంలో సందర్భానుసారంగా ఆస్తిపై, పశువులపై, మరియు ప్రజలపై శ్రద్ధవహించుట, భద్రపరచుట, కాపాడుట, శాసించుట, నియంత్రించుట, మరియు అధికారమును అభ్యసించుట అను భావములను కలిగియున్నది (3:24పై వ్యాఖ్యలను చూడండి).[12] అయితే దేవుడు, స్వయంగా, తన ప్రజల గొప్ప కావలివాడు, ఆయన కునుకడు నిద్రించడు (కీర్తనలు 121:4–8). తల్లిదండ్రులు స్వాభావికంగా తమ పిల్లల యెడల జాగ్రత్త కలిగి వారిని ఆపదల నుండి కాపాడతారు. అదే విధంగా, అన్నలు చాలా సార్లు తమకంటే చిన్న వారిని చూచుకొనునట్లు ఆదేశించబడతారు. అయితే, కయీనులో ఇలాంటిది ఏమి లేదు; హేబెలు ఎక్కడ ఉన్నాడు మరియు ఎలా ఉన్నాడు అన్న విషయంలో తనలో ఎలాంటి స్వాభావిక ఆప్యాయత లేదు. కాబట్టి, తన సోదరుని గూర్చి దేవుడు ప్రశ్నించినప్పుడు, అతడు అబద్ధమాడెను. హేబెలును గూర్చి అతడు తప్పించుకొనువాడివలె, ఆలోచనరహితునిగా ఉన్నాడు.

**వచనం 10**. జవాబు ఇచ్చి దేవుడు కయీను ప్రశ్నను గౌరవించలేదుగాని, "నీవు చేసిన పని యేమిటి?" అని అడిగి తాను చేసిన హేయమైన పనిని ఎదిరించెను. దీనిలో ప్రశ్నా రూపము ఉన్నప్పటికీ, వాస్తవానికి ఇది ఒక నిందారోపణ ఎందుకంటే దేవుడు సమాచారం కోరుటలేదు. కయీను మరొక తప్పించుకొనే ప్రశ్న అడిగేంతవరకు దేవుడు ఆగలేదుగాని, హత్యకు సాక్ష్యాన్ని బయలుపరచి ఆయనను ఆశ్చర్యపరచెను: **"నీ తమ్ముని రక్తము యొక్క స్వరము నేలలోనుండి నాకు మొరపెట్టుచున్నది."** "అతడు మృతినొందియు మాటలాడుచున్నాడు [అతని రక్తము]" (హెబ్రీ. 11:4) అని చెప్పుచు హెబ్రీ పత్రిక యొక్క రచయిత హేబెలును గూర్చి ఇలాంటి విషయాన్నే వక్కాణించుచున్నాడు. నేల పై కుమ్మరింపబడిన రక్తం హంతకునికి శిక్ష విధించాలని మాట్లాడుతున్నట్లు మొరపెట్టునని పురాతన ప్రజలు నమ్మేవారు.

హత్యను గూర్చి దేవుని పై నిందారోపణ చేసి, దేవునిపై వక్రమైన మొరపెట్టిన,[13] యోబు మాటలలో కూడ ఇట్టి భావమును చూడవచ్చు: "భూమీ, నా రక్తమును కప్పివేయకుము, నా మొఱ్ఱకు విరామము కలుగకుండును గాక" (యోబు 16:18). వాస్తవానికి, యోబుకు బాధ కలిగించినది దేవుడు కాదు సాతాను; కాని దేవుడు దానిని తనకు బయలుపరచలేదు కాబట్టి, అతనికి అది తెలుసుకొనే అవకాశం లేదు. అయినను, ఆరంభ దినముల నుండే, అమాయకులైన క్షతగాత్రుని యొక్క రక్తం తమ హంతకుని పై ప్రతీకారం కొరకు మొఱ్ఱపెట్టుచున్నదని ప్రజలు నమ్మారని ఇది మనకు తెలియజేయుచున్నది. యేసు రక్తము "హేబెలుకంటె మరిశ్రేష్ఠముగా పలుకును" అని హెబ్రీ పత్రిక రచయిత వ్రాయుచున్నాడు (హెబ్రీ. 12:24). హేబెలు రక్తము ప్రతీకారం కొరకు మాత్రమే మొఱ్ఱపెట్టెను; కాని యేసు రక్తము దుర్నీతిపరులందరి యొక్క పాపములు

మరియు నేరములకు ప్రాయశ్చిత్తం కలిగించును. అది ప్రతీకారానికి బదులుగా క్షమాపణ ఇచ్చును మరియు తద్వారా నశించినవారితో మరిశ్రేష్టముగా మాట్లాడును.

**వచనం 11**. తన తల్లిదండ్రుల వలెనే, కయీను కూడ తాను చేసిన నేరమునకు దుఖమును కనుపరచలేదు మరియు క్షమాపణను కోరలేదు. క్రియలకు పరిణామాలు ఉంటాయని అతడు నేర్చుకోవాలి, మరియు శిక్ష లేకుండా అతడు తన తమ్ముని ప్రాణమును తీసుకోకూడదు. వాస్తవానికి, ఇట్టి దుష్ట పని చేసినందుకు దేవుడు కయీను చంపలేదని పాటకుడు ఆశ్చర్యపోవచ్చు. అయితే తరువాత, కావాలని హత్యచేసినప్పుడు హంతకుడు చంపబడాలని, దేవుడు నియమం విధించుచున్నాడు (ఆది. 9:6; నిర్గమ. 21:12–14). అయితే, మరణ శిక్షను గూర్చి హెచ్చరించబడిన తరువాత బాధ మరియు సంఘర్షణతో జీవించుటకు ఆదాము హవ్వలకు కృపలో అవకాశం ఇవ్వబడినట్లే, కయీనుకు విధించబడిన శిక్షలో కూడ అలానే జరిగెను. అతడు నిశ్చయముగా మరణ పాత్రుడు; అయినను తన జీవనాధారమైన నేల నుండి అతడు శపించబడినప్పటికీ, అతడు జీవించునట్లు దేవుని కృప ప్రబలెను. **ఈ నేల** [తన] **హస్తము నుండి** [తన] **తమ్ముని యొక్క రక్తమును స్వీకరించుటకు నోరు తెరచెను.**

**వచనం 12**. ఒక విధంగా, తన కాళ్ళ క్రింద ఉన్న **నేల** చనిపోయెను, కాబట్టి అది **తన సారమును** (ఫలమును) **ఇకమీదట అతనికియ్యదు**. తాను ఒకప్పుడు సేద్యపరచిన నేల యొక్క ఫలమును ఇకమీదట అతడు అనుభవించడు.

నేల పై తీర్పు అనగా కయీను యొక్క "సమస్తము"తో ముడిపడియుండెను. అతడు "పొలము పంటను" యెహోవా యొద్దకు తెచ్చెను (4:3). అయితే ఇప్పుడు తన జీవితకాలమంతా ఆస్వాదించిన పని లేక తనకు నైపుణ్యం కలిగిన పనిని అతడు చెయ్యలేడు, ఎందుకనగా అతడు "ఆ నేలపై నుండి వెళ్ళగొట్టబడెను ..." (4:14).

తన పాపము వలన, కయీను పొలములేని మరియు గృహములేని **భూమిమీద దిగులుపడుచున్న దేశదిమ్మరియై యుండెను**. తమ అవిశ్వాసం, అవిధేయత, మరియు తిరుగుబాటు వలన నలబై సంవత్సరాలు అరణ్యంలో సంచారంచేసిన ఇశ్రాయేలీయులకు అతని అనుభవం ముందు హెచ్చరికగా ఉండెను (సంఖ్యా. 14:33, 34; ద్వితీ. 2:14, 15). వారి యొక్క నిరంతర అనైతికత మరియు విగ్రహారాధన వలన దేవుని ప్రజలు బలవంతంగా తమ దేశము నుండి తొలగించబడి చెరగొనపోబడినప్పుడు, కయీను యొక్క బహిష్కరణకు సమాంతరత ఇశ్రాయేలు చరిత్రలో తరువాత కూడ చూడవచ్చు (లేవీ. 18:24–29; 26:31–35; ద్వితీయోపదేశ కాండము 28:63–65).

మాటవరుసకు, తాను ఎన్నుకొన్న నరకానికే కయీను శిక్షించబడి పంపబడెను: తన కుటుంబంతో అతడు సమాధానంగా నివసించనియెడల, వారు

లేకుండానే అతడు జీవించవలెను. అతడు సమాజానికి హానికరంగా మారెను, కాబట్టి అతడు సమాజం వెలుపల జీవించవలెను. అదేవిధంగా, కయీను తన జీవితంలో దేవుని కోరలేదు కాబట్టి, అతడు తనతో లేక తన ప్రజలతో సహవాసం కలిగి జీవించుటకు దేవుడు కయీనును బలవంతపెట్టడు. ఈ భావము క్రొత్త నిబంధనలో మరింత అభివృద్ధి చేయబడెను: ఆఖరి తీర్పు తరువాత, దేవుని ప్రేమను మరియు సహవాసమును తిరస్కరించినవారు తన సన్నిధి నుండి మరియు యుగయుగాలుగా విమోచించబడిన ప్రజల నుండి వేరుచేయబడతారు (మత్తయి 8:11, 12; 2 థెస్స. 1:6–10).

**వచనములు 13, 14.** "నా దోషశిక్ష నేను భరించలేనంత గొప్పది!" అని చెప్పుచు కయీను దేవుడైన యెహోవా మాటలకు స్పందించెను. తన స్పందనలో తమ్ముని హత్యను గూర్చి ఎలాంటి పశ్చాత్తపము కనిపించలేదుగాని, స్వీయ జాలి మరియు దేవుని పై ఆగ్రహం మాత్రమే అతడు కనుపరచెను. తన పాపం యొక్క పరిణామం, నేలపై నుండి వెళ్ళగొట్టబడుట ... , అతడు అనుభవించవలసినదానికంటే గొప్పదని కయీను ఫిర్యాదుచేసెను. కయీను ఇలా చెప్పియుండవచ్చు, "నీవు నా తల్లిదండ్రులను ఏదెను నుండి వెళ్ళగొట్టితివి, కాని నా విధి మరింత ఘోరముగా ఉంది ఎందుకంటే నేను స్థిరపడుటకు ఎలాంటి స్థలము దొరకదు. అంతేగాక, నేల ఫలించుటకు నా తండ్రి యొక్క శ్రమను మరియు కష్టమును నీవు పెంచితివి, అయితే నన్ను మాత్రం సారము గల నేల నుండి పూర్తిగా దూరం చేసి, తిరుగాడువానిగాను దేశదిమ్మరిగాను చేసితివి. అంతేగాక, నేను నీ ముఖము నుండి దాగుకొందును. ఏదెనును మూసివేసిన తరువాత నా తండ్రి, నా తల్లి మరియు నా తమ్మునితో చేసినట్లే, నీవు ఇకను నన్ను చూడవు మరియు నన్ను కాపాడవు." ఇక్కడ హాస్యం ఏమిటంటే, ఇప్పటి వరకు, కయీను దేవుని సన్నిధిని ద్వేషించాడు మరియు దానిని తన జీవితంలో దేవుడు జోక్యంచేసుకొనుట అని అనుకున్నాడు. ఇప్పుడు, తాను ఏమి కోల్పోవుచున్నాడో గ్రహించాడు – కాని అప్పటికి చాలా ఆలస్యం అయ్యిపోయింది. అతడు నిస్సహాయుడై అన్నాడు, "**నన్ను కనుగొనువాడెవడో వాడు నన్ను చంపును.**" దేవుని నుండి ఎడబాటు కయీనులో ఇతరులు తనకు హానిచేస్తారేమో అనే భయం కలిగించెను.

కయీను యొక్క ఆందోళన ఆ సమయంలో లోకంలో ఇతర ప్రజలు కూడ ఉన్నారని స్థిరపరుస్తుంది, కయీను భార్యను తీసుకొని పట్టణమును నిర్మించెనని తెలుపబడిన వివరణ చూపుచున్నట్లే (4:17). ఎవరో ఒకరు "రక్తమునకు ప్రతీకారం తీర్చుటకు ప్రయత్నించి" హంతకుని చంపుటకు చూచుననెమోనని అతడు అలోచించి యుండవచ్చు. ఆదికాండము యొక్క రచయిత కాల పరిమితిని జోడించలేదు: ఆదాము హవ్వలను ఏదెనులో నుండి వెళ్ళగొట్టిన సమయం నుండి గర్భధారణ మరియు కయీను హేబెలుల జననం మధ్య కాలం ఎంతో అతడు

చెప్పలేదు, మరియు అన్న తమ్ముని చంపుటకు ముందు ఎంతకాలం అయ్యిందో కూడ చెప్పలేదు. అంతేగాక హంతకుడు ఎవరికి భయపడుచున్నాడో లేక అతని భార్య ఎక్కడ నుండి వచ్చెనో కూడ చెప్పలేదు. ఆదాము హవ్వలకు ఇతర పిల్లలు కూడ పుట్టారు, కుమారులు మరియు కుమార్తెలు (4:25; 5:4), కాని ఈ పిల్లల యొక్క కాలక్రమం ఇవ్వబడలేదు. కయీను యొక్క భార్య మరియు "రక్తం యొక్క ప్రతీకారం తీసుకొనదగిన" వ్యక్తి బంధువులు అయ్యుండొచ్చు – అందరు ఆదాము హవ్వల సంతతివారు (3:20; అపొస్తలులకార్యములు 17:26) – అయితే ఆదాము హవ్వలు తోటలో తమ వాస్తవిక గృహమును కోల్పోయి ఎంతకాలం అయ్యిందో తెలియదు. ఈ సన్నివేశాలన్నిటి యొక్క కాలక్రమానుసారమైన వృత్తాంతం ఇచ్చుట రచయిత యొక్క ఉద్దేశము కాదు. అతని దృష్టి మానవుని పరిస్థితిపై మరియు పాపంలోనికి దిగజారుటపై ఉండెను, మానవుడు దేవుని యొద్ద నుండి మరింత దూరమగుట, మరియు ఇదంతా ఆఖరికి గొప్ప జలప్రళయానికి ఎలా దారితీసెను.

**వచనం 15**. దేవుడు వేసిన శిక్ష భరించలేనంత గొప్పది అని కయీను వాదించెను, అయితే ఈ వచనం ఈ కథనంలో మలుపును తీసుకొనివస్తుంది. దేవుడు తీర్పు మాటలను ఘోషించెను, అయితే తరువాత ఆయన తన కృపను వాగ్దానము ద్వారా మరియు పశ్చాత్తాపంలేని పాపికి దైవిక కాపుదల ద్వారా కనుపరచెను. అందుకు దేవుడు, **"ఏవడైనను కయీనును చంపినయెడల వానికి ప్రతిదండన యేడంతలు కలుగుననెను."** "ప్రతిదండన" נָקַם (*naqam*) అను పదం పాత నిబంధనలో సాధారణంగా ఆయన శత్రువులపై లేక తన నిబంధనను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించు తన ప్రజలపై దేవుడు తెచ్చు దైవిక శిక్షను సూచిస్తుంది.[14] ఈ నియమము యొక్క ఉత్తమ సంప్రదాయక వివరణ, "పగతీర్చుటయు ప్రతిఫలమిచ్చు టయు నావే ... నా శత్రువులకు ప్రతీకారము కలుగజేసెదను, నన్ను ద్వేషించువారికి ప్రతిఫలమెచ్చెదను" (ద్వితీ. 32:35, 41; రోమా 12:19 చూడండి).

దేవుడు పాపమును మరియు దుష్టత్వమును చూసిచూడనట్లు వదిలిపెట్టి, శిక్ష ఇవ్వకుండా ఉంటె, తన స్వభావమైన పవిత్రత మరియు న్యాయమునకు ఆయన న్యాయముచేసినట్లుండెది కాదు. దేవుడు మనుష్యులపై లేక దేశములపై తాత్కాలిక తీర్పులు తెచ్చినప్పుడు, దానిని యెహోవా యొక్క "ప్రతిదండన దినము" అనేవారు (యెష. 34:8; 61:2; 63:4; 35:4; 47:3 చూడండి). అయితే, మోషే ధర్మశాస్త్రము యొక్క అధీనంలోని వ్యక్తిగత అనుబంధాలలో, దేవుని ప్రజలు తప్పుచేసిన వారిపై వ్యక్తిగత ప్రతీకారం తీసుకొనకూడదు. ఇశ్రాయేలుకు ఈ మాటలు చెప్పమని దేవుడు మోషేకు సూచించెను, "కీడుకు ప్రతికీడు చేయకూడదు, నీ ప్రజలమీద కోపముంచుకొనక నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమింపవలెను; నేను యెహోవాను" (లేవీ. 19:18). కయీను యొక్క కథ

కూడ హంతకుని పట్ల అలాంటి వైఖరియే కలిగియుండాలని సూచిస్తున్నట్లుంది.

"రక్తమునకు ప్రతీకారం తీర్చు" భావం, కొన్ని సార్లు పలు జాతులలో జరిగినట్లు, కుటుంబాలు మరియు గోత్రాల మధ్య "రక్త కలహాలు" ఆరంభించాలనే ఆలోచన కాదు. దుష్టులను శిక్షించుటకు ఎలాంటి కేంద్ర ప్రభుత్వం లేక న్యాయ వ్యవస్థ లేని గిరిజన సముదాయంలో దేవుడు ఒక న్యాయ వ్యవస్థను ఇచ్చుచున్నాడు. హత్య విషయంలో, హత్యచేయబడిన వాని యొక్క దగ్గర బంధువు న్యాయమును అందించాలి. తరువాత స్థాపించబడిన ఆశ్రయ పురములు ఈ అలవాటు యొక్క పరిష్కారమే; అనుకోకుండా చేసిన హత్యకు మరియు కావాలని చేసిన హత్యకు మధ్య ఇది తారతమ్యం చూపింది, మరియు అజాగ్రత్త వలన కలిగిన హత్యలకు తక్కువ శిక్ష ఇచ్చింది (సంఖ్యా. 35:9–28).[15]

కయీనును చంపినవానికి "యెడింతల" "ప్రతిదండన" కలుగుతుందని దేవుడు ప్రకటించినప్పుడు, ఆ మాటల అర్థంలో సందిగ్ధత ఉంది, కొన్ని సార్లు ఆలోచించినట్లు, కయీను యొక్క హంతకుడు మరియు తన కుటుంబంలో ఆరుగురు మరణిస్తారా లేక కయీను మొదలుకొని ఏడు తరముల వరకు దేవుడు శిక్షిస్తాడ. ఇది దేవుని ప్రతిదండన యొక్క సంపూర్ణత లేక పరిపూర్ణతను చూపు ఒక పద్యభాగ భాషా రూపము కావచ్చు. సంఖ్య "7" లేఖనాలలో చాలా సార్లు ఇట్టి ప్రాముఖ్యతతో పవిత్రమైన సంఖ్యగా ఉపయోగించబడెను (లేవీ. 26:24, 25; కీర్తనలు 12:6; 79:12; సామెతలు 6:31).

కృపలో దేవుడు కయీనుకు **ఒక గురుతు వేసెను**. ఇది అతని మీద శాపము కాదు; విరోధమైన లోకంలో అది అతనిని క్షేమముగా ఉంచుతుంది. నిజంగా, మనుష్యులు దానిని చూచినప్పుడు, అతడు దేవుని కాపుదల క్రింద ఉండెనని మరియు అతనిని **చంపకూడదని** గుర్తిస్తారు. కాబట్టి, ఈ "గురుతు" אוֹת (*'oth*) కనిపించేదిగా ఉండాలి. అది తన ముఖము లేక నుదుటిపై ఒక మచ్చ, లేక పచ్చబొట్టు వలె ఉండియుండవచ్చు. భూమిపై తాన స్వాభావిక సంవత్సరాలు జీవించుటకు అది సహాయపడెను.

**వచనం 16.** ఈ కథలోని వ్యంగ్యము ఏమిటంటే ఇది ఇద్దరు సోదరులు దేవుని ఆరాధించుటకు ఆయన యొద్దకు వచ్చుటతో ఆరంభమవుతుంది. ఈర్ష్య మరియు కోపముతో కయీను హేబెలును చంపిన తరువాత, పశ్చాత్తాపం లేని హంతకుడు యెహోవా సన్నిధిని విడచివెళ్ళెను. కయీను దేవునికి దూరంగా పరాయికరణ జీవితంలోనికి ఎలా ప్రవేశించెనో మరియు ఏదెనుకు తూర్పుదిక్కున ఉన్న నోదు దేశములో ఎలా స్థిరపడెనో ఆదికాండము యొక్క రచయిత ఈ విధంగా వివరించెను. "నోదు" נוֹד (*Nod*) అను పేరు యొక్క అక్షరార్థం "తిరిగాడుట," స్థిరములేని కష్టాల జీవితంలో ఉండుట.[16] ఒక ప్రత్యేకమైన స్థలము కాకుండా, ఇది "ఏదెనుకు తూర్పుదిక్కున" (దేవుడు వాస్తవికంగా మానవులకు ఇచ్చిన గృహము) ఉన్న భౌగోళిక ప్రాంతమును సూచిస్తుండవచ్చు, మరియు దేవుని

మార్గదర్శకత్వమును నిరాకరించిన ఈ వ్యక్తి “భూమిపై తిరుగాడు దేశదిమ్మరిగా” (4:14) ఉండునట్లు పొందిన దైవిక శిక్షను జీవించవచ్చు.

## రెండు వంశావళులు (4:17–26)

### కయీను కుటుంబము మరియు సంస్కృతి యొక్క ఆరంభము (4:17–24)

**[17]కయీను తన భార్యను కూడినప్పుడు ఆమె గర్భవతియై హనోకును కనెను.
అప్పుడతడు ఒక ఊరు కట్టించి ఆ ఊరికి తన కుమారుని పేరునుబట్టి హనోకను
పేరు పెట్టెను. [18]హనోకుకు ఈరాదు పుట్టెను. ఈరాదు మహూయాయేలును కనెను.
మహూయాయేలు మతూషాయేలును కనెను. మతూషాయేలు లెమెకును కనెను.
[19]లెమెకు ఇద్దరు స్త్రీలను పెండ్లి చేసికొనెను. వారిలో ఒక దాని పేరు ఆదా
రెండవదానిపేరు సిల్లా. [20]ఆదా యాబాలును కనెను. అతడు పశువులు గలవాడై
గుడారములలో నివసించువారికి మూలపురుషుడు. [21]అతని సహోదరుని పేరు
యూబాలు. ఇతడు సితారాను సానికను వాడుక చేయువారికందరికిని
మూలపురుషుడు. [22]మరియు సిల్లా తూబల్కయీనును కనెను. అతడు
పదునుగల రాగి పనిముట్లన్నిటిని ఇనుప పనిముట్లన్నిటిని చేయువాడు.
తూబల్కయీను సహోదరి పేరు నయమా.**

**[23]లెమెకు తన భార్యలతో**
**ఓ ఆదా ఓ సిల్లా, నా పలుకు వినుడి**
**లెమెకు భార్యలారా, నా మాట ఆలకించుడి**
**నన్ను గాయపరచినందుకై ఒక మనుష్యుని చంపితిని**
**నన్ను దెబ్బ కొట్టినందుకై ఒక పడుచువాని చంపితిని**
**[24]ఏడంతలు ప్రతి దండన కయీను కోసము, వచ్చిన యెడల**
**లెమెకు కోసము డెబ్బది యేడంతలు వచ్చుననెను.**

**వచనము 17**: కయీను తన సహోదరుని హత్యచేసి దైవిక తీర్పుక్రింద ఉన్నప్పటికీ, ఈ భూమిని ప్రజలతో నింపాలనే తన ప్రణాళికను దేవుడు వీడలేదు. కయీను ఎవరిని వివాహమాడాడు లేదా ఆ వివాహం ఎప్పుడు సంభవించింది అనే విషయాలు ఆదికాండము మనకు తెలుపలేదు. అయినప్పటికీ, ఆయన భార్య ఆదికాండము 5:4లో (3:20 చూడండి; అపొ. 17:26) తెలుపబడిన ఆదాము కుమార్తెలలో ఒక కుమార్తె అయ్యుండొచ్చు. ఈ భుమిపై చాలా కొద్దిమంది ప్రజలు ఉన్నప్పుడు, తోబుట్టువులమధ్య వివాహం అనివార్యమైనది. చాలా తరాల తరువాత కూడా, అబ్రాహాము తన మారుడు – సహోదరిని (20:12) వివాహమాడాడు. ఏదిఏమైనప్పటికీ, ఈ భూమిపై ప్రజలు వృద్ధిపొందిన కొలది, ఈ

అవసరత మరల లేదు, ఇంకా మోషే యొక్క ధర్మశాస్త్రము ఇటువంటి ఆచారాన్ని తీవ్రంగానే ఖండించింది (లేవీ. 18:9).

దేవుని మూల ఆశీర్వాదము మరియు ఆజ్ఞయైన "విస్తరించి భూమిని నిండించి ... " (1:28) అనునది పాపము ఉన్నప్పటికీ కొనసాగింది. ఆదాము మరియు హవ్వల వలెనే, **కయీను తన భార్యను ఎరిగినప్పుడు ఆమె గర్భము ధరించి, హనోకునకు జన్మనిచ్చింది**. మొదటి దంపతులువలే (4:1) గాక, కయీను గాని తన భార్య గాని తమ కుమారుడైన హనోకు జీవితం విషయంలో దేవునికి ఎటువంటి ప్రమేయండున్నది అనే విషయం తెలుపలేదు. ఆ తరువాత వ్రాయబడిన వంశావళి ప్రకారంగా, తమ జీవితాలలో దేవునికి ఎటువంటి స్థానం కూడా లేని ఒక సంతానానికి జన్మనిచ్చారు.

"హనోకు" అనే బిరుదు (దీనినే ఆంగ్లంలో "Hanoch" అని కూడా రాస్తారు) ఆదికాండములో చాలాసార్లు కనబడుతుంది. కాని ఈ పేరును కలిగియున్న ప్రముఖులలో, ఆదాము హవ్వల సంతానమైన కయీను కుమారుడు మరియు షేతు వంశములోనుండి వచ్చినవారు (5:18–24). వాస్తవముగా, "హనోకు" అనే పేరు ఒక అనిశ్చితమైన పదనిర్మాణం కలిగినది, కాని ఈ పేరు ఆదికాండములో వ్రాయబడిన రీతిగా హెబ్రీ భాష నుండి తీసుకోబడింది חָנַךְ (*chanak*), దీని అర్థము "శిక్షణ ఇవ్వు" లేదా "సమర్పించు." రెండవ అర్థం చాలా సరియైనదిగా ఉంది, ఎందుకంటే కయీను **ఒక పట్టణమును కట్టి** దానికి తన **కుమారుని గౌరవార్థం హనోకు** అనే పేరు పెట్టాడు.[17]

కయీనును దేశదిమ్మరిగా దేవుడు శిక్షించినప్పటికీ, ఆయన "నోదు" (అంటే, "సంచారము చేయు" దేశము–4:16 అని అర్థము) అనే ప్రాంతంలో స్థిరపడ్డాడు. క్రమేపి, ఆయన దైవిక ఆజ్ఞకు విరుద్ధంగా ఒక పట్టణమును కూడా నిర్మించాడు. కయీను ఎల్లప్పుడూ దేవునికి అవిధేయుడై జీవించాడని వాక్య భాగము సూచిస్తున్నది.

**వచనము 18**. తదుపరి వాక్యములో హనోకు యొక్క నలుగురు కుమారులను వరుస క్రమంలో చూడగలం: **ఈరాదు, మహూయాయేలు, మతూషాయేలు, మరియు లెమెకు.** ఈ మొదటి ముగ్గురు పేర్లు తప్ప వారిని గురించిన యితర సమాచారమును యివ్వలేదు. వారు అంతగా చెప్పుకోదగ్గ వాటిని ఏమీ చేసినట్టులేదు. కాని భూమిని నింపుట అను దేవుని ప్రణాళిక విషయములో ఆదాము నుండి కయీను మధ్యగల సంతతివారికి వారు గొలుసులా ఉన్నారు. రచయిత త్వరగా నాల్గవ వ్యక్తి దగ్గరకు వెళ్తున్నాడు, ఆదాము నుండి ఏడవ తరమైన అంతగా ప్రసిద్ధముకాని లెమెకు వద్దకు వచ్చాడు.

**వచనము 19**. లెమెకు యొక్క నైతిక దిగజారుడుని తెలిపే మొదటి విషయం ఆయన ఇద్దరు భార్యలను వివాహమాడడం: ఆదా మరియు సిల్లా. అయితే, ఈయనతోనే ఏకపత్నీవ్రతం విచ్ఛిన్నం అయినట్లు కనబడుతుంది. వాస్తవానికి,

ఇది సృష్టిలోని దేవుని చిత్తమునుండి తప్పిపోవుటయే: "కాబట్టి పురుషుడు తన తండ్రిని తన తల్లిని విడచి తన భార్యను హత్తుకొనును; వారు ఏకశరీరమైయుందురు" (2:24). దేవుని కృప మరలా ముందుకు వచ్చింది: ఆయన లెమెకును దీనిని బట్టి దండించలేదు, అలాగే బహుపత్నీవ్రతమును పాటించిన మూలపురుషులను కూడా ఆయన దండించలేదు. అయినను, ఇట్టి దారి తప్పిన జీవితమును జీవించినవారిపై ఇది చాలా బాధాకరమైన పరిస్థితులను తీసుకొచ్చింది. నిజానికి, పాతనిబంధనలో చూస్తే ఇట్టి తప్పిపోయిన జీవితములో పాలుపంచుకున్న ప్రతి ఒక్క వ్యక్తి కూడా చాలా విచ్ఛిన్నమైన గృహ పోరాటాలను ఎదుర్కొన్నట్లుగా అర్థమౌతుంది. ఒక విధంగా చూస్తే, వివాహము విషయంలో దైవ ప్రతిష్ఠమైన సృష్టికర్త యొక్క మార్గమునకు బదులుగా సృష్టింపబడిన వారు తమ సొంత మార్గమును అవలంబించుటవలన ఏమి సంభావిస్తుందో నేర్చుకొనుటకు దేవుడు ఇట్టి **కఠిన మార్గమున వెళ్ళుటకు మనుష్యులను అనుమతించాడు.**

**వచనాలు 20–22. ఆదా మరియు సిల్లా**, కలిసి మొత్తం నలుగురు పిల్లలను కన్నారు. ఆదాకు ఇద్దరు కుమారులు, సిల్లాకు ఒక కుమారుడు ఒక కుమార్తె. ప్రతి ఒక్క కుమారునికి ఒక పేరు ఇవ్వబడింది. ఆ పేర్లు ప్రతివాని పని మరియు అతడు నాగరికతకు తన వంతులో చేసిన సహాయమును వివరించు చున్నవి. సిల్లా కుమార్తె అయిన నయమా విషయానికొస్తే, ఏమియు చెప్పబడలేదు; ఎలాంటి సాంస్కృతిక పురోగతి సాదించినట్లు ఆమెకు ఆపాదించలేదు.

ఆదాకు యాబాలు పుట్టడం మొదట వివరించబడింది. అతడు పశువులు గలవాడై గుడారములలో నివసించువారికి మూలపురుషుడు అని గూర్చి చెప్పబడింది. ఈ సందర్భంలో, "మూలపురుషుడు" అనేది అక్షరార్థంగా వాడబడలేదు గాని అలంకారంగా వాడబడింది. యాబాలు అనువాడు పాక్షిక-సంచార డేరా వాసులకు మరియు పశువుల మందలను కలిగి యున్నవారందరికి వ్యవస్థాపకుడుగా ఉంటున్నాడు. ఈ వాక్యము కొంతమంది దృష్టిలో మునుపు హేబెలును గూర్చి "గొర్రెల కాపరి"గా (4:2) చెప్పబడిన వాక్యమునకు విరుద్ధముగా ఉంది. యాబాలు అనువాడు ఇట్టి వృత్తికి వ్యవస్థాపకుడని ఎలా చెప్పగలము? అయితే ఇట్టి అభ్యంతరము తెలుపు వారు హేబెలు మందలను ప్రస్తావించుటకు వాడబడిన హెబ్రీ పదం צֹאן (*tso'n*) అనియు[18], ఆ పదం చిన్న జంతువులైన గొర్రెలు మరియు మేకలను గూర్చి చెప్తుందన్న విషయాన్ని వారు గమనించడం లేదు. యాబాలు యొక్క వృత్తిని తెలుపుటకు వాడబడిన మూల పదం מִקְנֶה (*miqneh*), ఇది "అన్ని జంతువుల మందను కాయుటను" సూచిస్తుంది, అంటే గొర్రెలు, మేకలు, పశువులు, గాడిదలు, మరియు ఒంటెలు (47:16, 17; నిర్గమ. 9:3).[19] కాబట్టి, ఈ వాక్యభాగములో ఎటువంటి వైరుధ్యము లేదు.

ఆదా యొక్క వేరే కుమారుడైన **యూబాలు సితారాను సానికను లేదా "వీణె మరియు పిల్లనగ్రోవి"** (NIV), వాడుక చేయువారికందరికిని మూలపురుషుడు

అని వ్రాయబడింది. ఈ ప్రాచిన సంగీత పరికరాలనుండి తరువాత చాల వృద్ధిచెందాయి. "సితారా" అనునది తీగెతో చేయబడి చేతితో వాయించబడే ఒక సాధనము (1 సమూ. 16:23), ఇంకా "సానిక" అనునది బహుశా పాతనిబంధనలో చాలా తక్కువ సార్లు ప్రస్తావించబడిన ఒక వెదురు వాద్యము అని చెప్పవచ్చు, దీనిని వీణతో కలిసి వాయించేవారు (యోబు 21:12; 30:31).

సిల్లాకు పుట్టినటువంటి **తూబల్కయీను** నాగరికతలో లోహపుపని యొక్క సాంకేతికతకు మూలపురుషుడు అయ్యాడు. **ఆయన పదునుగల రాగి పనిముట్లన్నిటిని ఇనుప పనిముట్లన్నిటిని చేయువాడుగా వివరించబడింది.** అయినను, పనిముట్లన్నిటిని "చేయువాడు" అనుటలో మానవుని చరిత్రలో నేటి కాలము కంటే కూడా బాగా అభివృద్ధి చెంది శాస్త్రీయంగా పనిముట్లు చేయు విధానమును సూచిస్తుంది. హెబ్రీ మూలపదమైన לטשׁ (*latash*)కు ఇంకా ఖచ్చితమైన అనువాదం "పదును చేయడం," "కొట్టడం," లేదా "సుత్తితో కొట్టడం."[20] దీనికి తోడు,"ఇత్తడి"గా అనువదించబడిన נחשׁת (*n^e^chosheth*) అను పదమునకు అసలు అర్ధము "రాగి,"[21] దీనితోనే తూబల్కయీను పనిచేసి ఉంటాడు. దృఢమైన లోహమును తయారు చేయుటకు రాగిని టిన్ తో కలపడం క్రీ.పూ. నాల్గవ సహస్రాబ్ది చివరి భాగం లేదా మూడవ సహస్రాబ్ది మొదటి భాగము వరకు జరగలేదు.

ఇంకా, "ఇనుపపనిముట్లన్నియు" అనే వాక్యాన్ని చదివి ఈ ప్రాచీన కాలంలోనే అత్యాధునికమైన ఇనుప పనిముట్లు మరియు ఆయుధాలు సమృద్ధిగా దొరికేవి అని ఒకరు అనుకోకూడదు. ఖనిజ ద్రవ్వకాలు మరియు ఇనుము కరుగబెట్టడం అనాతోలియాలో ఉన్న హిత్తీయులలో దరిదాపుగా క్రీ.పూ. 1400 వరకు ప్రారంభమవ్వలేదు గనుక, ప్రాచీన పశ్చిమ ఆసియాలో ఉన్న కొద్దిపాటి ఇనుము ప్రాథమికంగా కొన్ని ఉల్కల నుండి వచ్చి ఉంటాయి. క్రీ.పూ. మూడవ సహస్రాబ్దికి చెందిన అనేక ఉల్క ఇనుప వస్తువులు మరియు పనిముట్లు ఐగుప్తు మరియు మెసొపొతమియలో కనుగొనబడినవి. కొన్ని ఆకాశమండలమునకు చెందిన ఇనుప వస్తువులు కనుగొనబడటం వాస్తవమైయుండగా, వాటిలో ఉన్న నికిల్ పరిమాణం ఆదిమ మానవుడు ఉపయోగించిన ఇనుము కంటే కొంచెం వ్యత్యాసము కలది. చాలా మంది పండితులు ఏమి చెప్తుంటారు అంటే ఈ ఇనుము "బంగారమును కరిగించే ప్రక్రియలో ఒక సాధనముగా" గా ఉపయోగించారు అని.[22]

యాబాలు, యూబాలు మరియు తూబల్కయీను అనువారు నాగరితకు చేసిన సాంస్కృతిక సహకారాలు ముందుకు దూసుకుపోయేందుకు వేసే పెద్ద అడుగులు కానవసరం లేదు (కనీసం, ఆధునిక పరిమితులను అనుసరించి). అయినను, బైబిల్ రచయిత వారికి కొన్ని ప్రదేశాలలో అభివృద్ధిని ఆరోపించాడు. వారుసుదీర్ఘ కాలంలో వృద్ధిచెందిన సాంస్కృతిక కళలకు మరియు వృత్తులకు ముందుండెడి వారుగా మూల కారకులుగా ఉన్నారు. సాంస్కృతిక పురోగతి

మరియు ఆవిష్కరణల ఎదుగుదలతోనే పాపము కూడా వచ్చింది. నాగరికతఫలదీకరణచెందిన కొలదీ–తనలో తనను ఒక మంచి వ్యక్తిగా, తన తోటివారిని ఇంకా ఎక్కువ మర్యాదతో చూచుకొనేలాగున, లేదా దేవుని పట్ల తనలో ఎక్కువ గౌరవ ప్రవర్తనను కలిగించే దిశగా మనిషి అవ్వలేదు.

కయీను సంతానముచే పొందబడిన పురోగతులు వాటంతట అవి చెడ్డవి కావు. నిజానికి, ఈ వ్యక్తులు అనుభవించిన భౌతికమైన ఆశీర్వాదాలు మరియు వారు ప్రయోగించిన తలాంతులు కృపగల సృష్టికర్తనుండి వచ్చిన వరములు మరియు ఈ భూమిపై మానవుని జీవితమును మెరుగుపరచుటకు అవి రూపించబడినవి. అయినప్పటికీ, వరములు కొన్నిసార్లు తొట్రిల్లుటకు కారణాలు కావచ్చు: దేవుడు దయచేసిన సామర్థ్యాలతో మానవుడు సాధించిన కొలదీ, గర్వముతో అతను ఇంకను పొంగిపోవచ్చు; అతడు ఇంకా తన సొంత సాధనలమీద ఎక్కువగా అతిశయించుటకు మొగ్గు చూపుతూ తన జీవితంలో దేవుని యొక్క అవసరత చాలా తక్కువ అనుకుంటూ ఉంటాడు. సంస్కృతి, దానంతట అది, ప్రజలను ఉత్తమ వ్యక్తులుగా చేయలేదు. అది వారిని నైతికంగా నీతిమంతులుగా, ఒకరినొకరుప్రేమించుకునే విధంగా, లేదా దేవుని పట్ల కృతజ్ఞత మరియు మర్యాదను కలిగియుండే విధంగా చేయలేదు. సంస్కృతి పాపపు సమస్యను గూర్చి ఏమి చేయలేదు. అది ఆపబడకపోతే, పాపము సమాజములో అంతరాయాలను మరియు అసమతుల్యతలను సృష్టిస్తుంది. ఈ విషయం లెమెకు పలికిన పగపూరిత పదాలలోనూ మరియు తదుపరి చోటుచేసుకున్న సంఘటనల ద్వారాను మనకు స్పష్టమౌతుంది.

**వచనము 23**. ఇద్దరు **భార్యలను** తీసుకోనుటలో, లెమెకు వివాహము పట్ల దేవుడు కలిగియున్న అసలైన ప్రణాళిక నుండి వైదొలగి **ఆదా మరియు సిల్లాలను** ఒక పోటీగల మరియు అవమానపూరితమైన పరిస్థితిలోకి నెట్టాడు. లెమెకు తనకు ఇబ్బంది కలిగించిన ఎవరిపైనైనా తన బలాన్ని తన అజమాయిషిని ఉద్ఘాటించాడు, ఇంకా ఆయన తన భార్యలు తనను వినాలని మరియు [తన] మాటలను ఆలకించాలని వారికి చెప్పడం ద్వారా తన అహంకారాన్ని ప్రదర్శించాడు. ఆయన పదాలు ఒక పద్యముగా ఇవ్వబడినవి. తన ఉపన్యాసంలో ఎటువంటి ఆయుధము ప్రస్తావించబడలేనప్పటికీ, ఇది తరచుగా "ఖడ్గము యొక్క కీర్తన"గా చెప్పబడింది. లెమెకు కుమారుడైన తూబల్కయీను ఒకక్రొత్త లోహపు ఆయుధమును రూపించాడు అనే వాస్తవము ఆయనకు అతిశయకారణముగా ఉన్నందున లెమెకు జయశాలిగా భావించాడు.

ఇతని రెచ్చగొట్టే కీర్తనలో, లెమెకు తన భార్యలతో డంబంగా మాట్లాడుతూ, అన్నాడు, **"నన్నుగాయపరచినందుకై ఒక మనుష్యుని చంపితిని నన్ను దెబ్బ కొట్టినందుకై ఒక పడుచువాని చంపితిని."** ఈ వాక్యము అనువాదము విషయములో కనీసం రెండు ప్రశ్నలు తలెత్తుతాయి. మొదటిగా, లెమెకు తనపై

దాడిచేయాలని భావించేవారికి ఒక హెచ్చరిక ఇస్తున్నాడా, లేదా అప్పటికే చోటుచేసుకున్న ఒక సంఘటనను గూర్చి అతడు మాట్లాడుతున్నాడా? హెబ్రీ వాక్యభాగంలో ఇక్కడ הָרַג (*harag*) అనే పదమునకు పరిపూర్ణ రూపం ఉంది, దీనిని కొందరు "నేను (నన్నుగాయపరచే ఎవరినైనా) చంపుతాను" అనే అర్థంలో తీసుకున్నారు.[23] అయినను, అధిక ఆంగ్ల అనువాదాలు NASB అనువాదంతో ఏకీభవిస్తూ ఈ క్రియారూపాన్ని పరిపూర్ణ క్రియారూపంగా ("నేను చంపియున్నాను/హత్యచేసియున్నాను" లేదా "నేను చంపాను"[24]) అనువాదించాయి. దీనికి అర్థము లెమెకు కేవలం నరహంతకుడు మాత్రమె కాదు, తను చేసిన దానిగూర్చి గర్వముగా భావించే ఒక తుచ్ఛమైన వ్యక్తి.

రెండవదిగా, ఇందలి భాష ఒక వ్యక్తి హత్యనుగురించి మాట్లాడుతుందా లేదా ఇద్దరి హత్యను గురించా? NASB అనువాదాన్ని పరిశీలిస్తే ఇద్దరు అని తెలుస్తుంది, ఎదుకంటే అది "ఒక మనుష్యుని" మరియు "ఒక పడుచువానిని" అని ప్రస్తావిస్తుంది. అయినప్పటికీ, ఇటువంటి పద్యభాగ సాహిత్యంలో, ఈ రెండు పాదాలు ఒకే వ్యక్తిని సూచిస్తున్న ఒక సమాంతరపు పాదాలు కావచ్చు. "బాలుడు"కు బదులుగా, అధిక అనువాదాలు יֶלֶד (*yeled*) అనే పదమును "పడుచువాడు"గా అనువదించాయి.[25] ఇక్కడ రెండుమార్లు వచ్చిన పదముల ఉద్దేశము "మనుష్యుడు" మరియు "పడుచువాడు" అనే పదాలు ఒకే వ్యక్తిని సూచిస్తున్నవని చెప్పుటకు మద్దతిస్తున్నాయి. ఈ విషయంలో, "పడుచువాడు" అను పదము ఒక వ్యక్తి తన జీవితపు ముఖ్యమైన కాలంలో ఉన్నాడు గనుక అతని యొక్క బలాన్ని ఉద్ఘాటిస్తుంది.

ఈ రెచ్చగొట్టే కీర్తనలో లెమెకు యొక్క ప్రవర్తన తన పితరుడైన కయీను ప్రవర్తనకు కొంత వ్యత్యాసముగా కనబడుతుంది. హత్య చేసి తరువాత దానిని కప్పిపుచ్చడానికి చూసాడు, దేవుడు తనను అడిగినప్పుడు తన సహోదరుని ఆచూకి తెలియనివానిగా నటించాడు (4:9). దీనికి విరుద్ధంగా, లెమెకు తను చేసినదానిపట్ల గర్వపడుతూ తన భార్యలకు అది చెప్పాలనుకున్నాడు తద్వారా వారు, ఇంకా బహుశా ఇతరులు కూడా, అతను ఎంతటి ఘోరమైన వ్యక్తో తెలుసుకోవాలని అలా చేసాడు.

**వచనము 24.** తన నేరమును గూర్చి చెప్పిన తరువాత, లెమెకు అన్నాడు, **"ఏడంతలు ప్రతి దండన కయీను కోసము వచ్చిన యెడల లెమెకు కోపము డెబ్బది యేడంతలు వచ్చుననెను."** మరియొక మారు, ఆయన మాటల అర్థము ఇక్కడ స్పష్టంగా లేదు. NLT అనే అనువాదంలో ఈ ఆలోచన ఉండొచ్చు: "కయీనును చంపువారికి ఏడంతలు ప్రతిదండన ఉంటె (4:15), నన్ను చంపువానికి డెబ్బది యేడంతలు ప్రతిదండన కలుగును!" ఇది సరియైతే, లెమెకు తన నేరమును బట్టి న్యాయతీర్పు తెచ్చువానిపై శాపాన్ని పలుకుతున్నాడనే చెప్పాలి.

లెమెకు తన జీవాన్ని తీసుకొనుటకు ప్రయత్నించు ఎవరిపైనైనా పగ

తీర్చుకొనుటకు తననుతానె (దేవుడిని కాదు) ప్రతివాదిగా భావించియుండి ఉంటాడు. ఈ విషయంలో, దేవుడు కయీనును చంపిన వానిపై పంపే ప్రతిదండనకంటే ఆయన ఇచ్చే ప్రతిదండనే ఎక్కువగా ఉంటుందని అహంకారంగా చెప్తున్నాడు. “డెబ్బదిమార్లు-ఏడు” ఒక ఎక్కువ చేసిన చెప్పిన మాట, అత్యున్నత స్థాయి దీని అర్థం.[26] ఆ యవ్వనుని చంపినందుకు ఎవరైనా వానిని శిక్షించుటకు ప్రయత్నిస్తే, అతడు వానిని నాశనము చేస్తాడు. “7” అనే సంఖ్యాప్రయోగం, సంపూర్ణతను మరియు పరిపూర్ణతను సూచించేదిగా, సృష్టిలో దేవుడు ఏడు రోజుల్లో చేసిన సృష్టి అంతటిపై, అంటే దేవుడు విశ్రమించిన దినముతో కలిపి, ఆధారపడి ఉంది. అయినను, లెమెకు—దీనిని మిక్కిలియైన దుష్టత్వమును సూచించే క్రమంలో ఈ సంఖ్యను వాడాడు అని చెప్పాలి.

ఇక్కడ ప్రయోగించబడిన అలంకారపు భాష అర్థము లెమెకు ఒక హత్యా యంత్రంగా చేయబడ్డాడు, ఆదికాండము 6:4, 5, 11 లో ఉన్న బలశూరులైన హింసాత్ములకు మూలపురుషునిగా ఉన్నాడు. కయీను వంశావళి ఏడు వద్ద ఆపబడుటకు ఇదే కారణమైయుండొచ్చు. ఆదాము నుండి ఏడు తరాలలోపు, నైతిక మరియు ఆత్మీయ విచ్ఛిన్నం—పగ మరియు హత్యాశతో కలిపి—పరిపూర్ణంగా పెరిగినవని; దానికి లెమెకు ఒక దర్పణంగా ఉన్నాడని ఈ వాక్య రచయిత ఉద్ఘాటించాలని భావించి ఉంటాడు. ఈ భూమిపై వినాశమును తెచ్చిన వారి పేర్లు చెప్పడం ఇక్కడ అనవసరం, కాని వారి యొక్క పాపము జలప్రళయంలో దేవునితీర్పుకు దారితీసింది (6–8 అధ్యాయాలు).

## షేతు మరియు ఆయన కుటుంబము (4:25, 26)

**[25]ఆదాము మరల తన భార్యను కూడినప్పుడు ఆమె కుమారుని కని కయీను చంపిన హేబెలునకు ప్రతిగా దేవుడు నాకు మరియొక సంతానమును నియమించెనను కొని అతనికి షేతు అను పేరు పెట్టెను. [26]మరియు షేతునకుకూడ కుమారుడు పుట్టెను. అతనికి ఎనోషను పేరు పెట్టెను. అప్పుడు యెహోవా నామమున ప్రార్థన చేయుట ఆరంభమైనది.**

**వచనము 25.** ఆదాము నుండి లెమెకు వరకు గల ఏడు తరాలను క్లుప్తంగా పొందుపరచిన తరువాత, ఈ వచనము కయీను సంతానమునకును తరువాత వచ్చే షేతు తరమునకును ఒక మార్పుగా ఉంటుంది. మానవుడు (రెండుసార్లు **ఆదాము** మరియు ఒకసారి కయీను) **తన భార్యను కూడినప్పుడు ఆమె కుమారుని కనెను అని రచయిత చెప్పడం ఇది మూడవ సారి** (4:1, 17, 25). హవ్వ తన కుమారునికి షేతు అని పేరుపెట్టింది. హెబ్రీ వాక్యభాగంలో, **“షేతు”** שֵׁת (*Sheth*) అనే పేరుకును మరియు హవ్వ యొక్క మాటయైన “కయీను చంపిన హేబెలునకు ప్రతిగా దేవుడు నాకు మరియొక సంతానమును నియమించెననుకొని

שָׁת (*shath*)" అను వాక్యమునకు మధ్య పదకేళి ఒకటి ఉంది.

కయీను పుట్టినప్పుడు హవ్వ చెప్పిన మాటలకు ఈ మాటలకూ తేడా వుంది (4:1), అప్పుడు ఆమె తన దృష్టి అంతయు తనమీదనే పెట్టుకున్నది("నేనొక ..."). షేతు జన్మతో, ఆమె యొక్క దృష్టి అంతయు యెహోవా మీద ఉన్నది ("దేవుడు ..."). హవ్వ యొక్క కొంత ఆత్మీయ పరిపక్వతను ఈ వచనం మనకు సూచిస్తుంది. కయీను చంపిన తన నీతిగల కుమారుడైన హేబెలు మరణమునకు దేవుని స్పందనగా షేతును హవ్వ భావించింది. ఇంకా, షేతును మరియొక "సంతానము"గా זֶרַע (*zera'*), అంటే "విత్తనము," గా ఆమె అనుకొంది. ఈ పదసమూహము సర్పము యొక్క తలను ఒక దినాన చితకద్రొక్కే వాగ్ధానము చేయబడిన "సంతానము"ను (3:15) మనకు జ్ఞాపకమునకు తెస్తుంది. ఈ అస్పష్టమైన వాగ్ధానమును హవ్వ ఎలా అర్థం చేసుకొందో మనకు తెలీదు గాని (3:15పై ఉన్న వివరణ చూడండి), షేతు ద్వారా హేబెలు వంటి నీతివంతమైన ఒక సంతానము వస్తుందని ఆమె ఆశించినట్లుగా ఈ వాక్యము మనకు సూచిస్తుంది. ఆదికాండము మిగితా భాగములో వివరించబడిన అనేక వ్యక్తులు ఈ ఆశను సార్ధకం చేసినవారుగా మనకు కనబడతారు.

**వచనము 26**. షేతు మొదటి కుమారుడైన ఎనోషు యొక్క జన్మ ప్రకటనకు అర్థము వాగ్దాన "సంతానము" కొనసాగుతుందన్న నిరీక్షణ. "ఎనోషు" אֱנוֹשׁ (*'Enosh*) అను పదము אָדָם (*'adam*) 1:26, 27; 5:1–5 చూడండి) వలె ఇంకొక పదము. ఇది సాధారణ "మానవుడు" అనే అర్థాన్ని కలిగి వుంటుంది (యోబు 36:25; కీర్తనలు 8:4), మరియు ఒక ప్రత్యేక వ్యక్తి యొక్క పేరును (ఇక్కడ మరియు 5:6–11లో) ఇది తెలుపుతుంది. ఎనోషు యొక్క ప్రభావము వలన, మానవులు యెహోవా పేరట ప్రార్ధన చేయుట ఆరంభమైనది. మూలపురుషుల యొక్క మతసంబంధమైన కార్యాలను తెలుపుటకు ఆదికాండములో ఈ భావము సాధారణంగా ప్రయోగించబడింది (12:8; 13:4; 21:33; 26:25). ఇది ఆరాధనను, మామూలుగా యెహోవాకు ప్రార్ధన మరియు బలులను సూచిస్తుంది. ఇక్కడ రచయిత మునుపు పశువులను కాయుట, సంగీతమును వాయించుట, మరియు లోహపు పనులను చేయుట యొక్క ఆరంభమును గూర్చి తెలిపినట్లు గానే దేవుని పేరిట దైనందిన ఆరాధన యొక్క ఆరంభమును గూర్చి తెలుపుతున్నాడు.[27]

## అన్వయము

### పాపము వలన వచ్చు యెడబాటు (4:1–16)

పాపము అనునది దేవుని ఆజ్ఞను మీరడం (1 యోహాను 3:4), అది నోటి

ద్వారా పలుకబడిన ఆజ్ఞ కావచ్చు, లేదా లిఖిత పూర్వకమైన ఆజ్ఞ కావచ్చు, లేదా మనుష్యుల హృదయాలపైన వ్రాయబడిన (రోమా 2:12–15) ఆజ్ఞ కావచ్చు. దేవుని పోలికలో చేయబడుట వలన, ప్రతి వ్యక్తికి తనలో స్వీయ – నిర్మితమైన నైతిక మనసాక్షి ఉంటుంది. ప్రాచీన కాలం నుండే, లిపి కనుగొనబడకముందు, దేవుడు ఆదాము మరియు హవ్వ, కయీను, నోవహు మరియు ఇతరులతో చెప్పినట్లుగా మానవాళికి తన చిత్తాన్ని నోటి మాటద్వారా తెలియజేశాడు.

దేవుని ఆజ్ఞలు అనునవి ప్రజలకు తమ జీవితాలలో సంతోషాన్ని తిరస్కరించే యదేచ్ఛిక నియమాలు మరియు నిషేధాలు కావు. దీనికి భిన్నంగా, ఒక ఫల భరితమైన మరియు సంపూర్ణమైన జీవాన్ని పొందుటకు దేవుడు తన కట్టడలను సూచికలుగా ఇచ్చాడు. పాపము అనునది ఎప్పుడు కూడా అవ్యక్తికమైన కట్టడలను మీరడం కాదు; పాపులు దైవిక ఆజ్ఞలు మీరడం ద్వారా సమూలంగా తమను తామే విచ్ఛిన్నం చేసుకుంటారు.

*అంతరంగములో యెడబాటు.* మానవుని మనస్సుపై పాపమునకు వినాశనాత్మకమైన ప్రభావం చూపుతుంది. మానవుని వ్యక్తిత్వపు లోపలి భాగంలో అది యెడబాటును కలిగిస్తుంది. తన అంతరంగములో పాపి ఒక అంతరంగ యుద్ధము చేస్తున్నట్లుగా భావిస్తాడు. ఈ పోరాటాన్ని పౌలు ఈ విధంగా వివరించాడు:

> నేను చేయగోరు మేలుచేయక చేయగోరని కీడు చేయుచున్నాను. వేరొక నియమము నా అవయవములలో ఉన్నట్టు నాకు కనబడుచున్నది. అది నా మనస్సునందున్న ధర్మశాస్త్రముతో పోరాడుచు నా అవయవములలోనున్న పాపనియమమునకు నన్ను చెరపట్టి లోబరచుకొనుచున్నది. అయ్యో, నేనెంత దౌర్భాగ్యుడను? ఇట్టి మరణమునకు లోనగు శరీరమునుండి నన్నెవడు విడిపించును? (రోమా 7:19, 23, 24).

ఈ విధమైన పోరాటము మానవులందరిలో జరుతుగుంది, సదరు వ్యక్తి పాపమును ఎలా పరిగణిస్తున్నాడు అనే విషయంపై ఆధారపడి తక్కువ మొత్తంలో అయినా ఎక్కువ మొత్తంలో అయినా ఉంటుంది. ఒక వ్యక్తి పాపపూరితమైన మరియు వినాశనాత్మకమైన జీవనశైలిలోనే ఉంటూ నీతిమంతుడిగా నటిస్తూ పాపమును కప్పిపుచ్చాలని చూస్తే, అతను ఒక ఆత్మీయమైన మనోవైకల్యముతో బాధపడుతుంటాడు. కయీనుకు జరిగినది ఇదే కాబోలు: సేద్యము చేయుటలో చాల కష్ట పడి దేవునికి అర్పణగా కొంత భాగాన్ని తెచ్చుట ద్వారా, ఆయన మంచి కుమారునిగా, అంటే బాధ్యతగల మరియు ధార్మికమైన కుమారునిగా, నటించాడు.

అయినప్పటికీ, ఉపరితలమున నక్కి ఉన్నవన్నియు తన సహోదరుడైన హేబెలుపై అతను పెంచుకున్న కోపపూరిత, ద్వేషపూరిత మరియు ఈర్ష్వపూరితమైన భావాలే. ఆయన దేవునితో కూడా కోపంగా ఉన్నాడు, బహుశా

తన తల్లిదండ్రులను ఏదెను నుండి బయటకు తోలివేసి వారికందరికీ జీవితమును దుర్భరము చేసినందుకు కావచ్చు. ఖచ్చితంగా, తన సహోదరుని అర్పణను అంగీకరించి తన అర్పణను తిరస్కరించినందుకు గాను కయీను దేవునిపై కూడా కోపోద్రేక్తుడై ఉన్నాడు. తన ప్రాణమునకు స్వస్థత కలిగించుటకుగాను తన పాపమును దేవునితో ఒప్పుకొని క్షమాపణ కోరుకొనుటకు బదులు, కయీను తన ఆవేశ విస్ఫోటన ద్వారా తన వ్యక్తిత్వమును విచ్ఛిన్నమగునట్లు చేసుకున్నాడు. తన బీటలువారిన వ్యక్తిత్వము మరియు తన వేషధారణ యొక్క ఒత్తిడిని మరియు యెడబాటును కయీను అధీన పరచుకొనలేనప్పుడు, తన సహోదరుని హతమార్చాడు. తన దుష్ట క్రియను కప్పిపుచ్చుకొనుటకు ప్రయత్నించి దేవునితో అబద్ధమాడాడు, తను చేసిన దానిని అసలు యెరుగను అని చెప్పాడు.

*ఒకని కుటుంబంలో యెడబాటు.* మొదటి దంపతులైన ఆదాము మరియు హవ్వల జీవితంలో పాపము తెచ్చిన యెడబాటును మూడవ అధ్యాయము ఉదహరిస్తుంది. వారు పాపము చేసి దేవునిచే ఎదుర్కొనబడినప్పుడు, వారు చాడీలు చెప్పడం మొదలుపెట్టారు. ఆదాము మొదటిగా తన భార్యయైన హవ్వను నిందించాడు, తరువాత ఆమెను తనకు ఇచ్చినందుకు దేవుణ్ణి కూడా నిందించాడు. దీనివలన ఆమె నిస్సందేహంగానే బాధపడింది, తరువాత ఆ నెపమును తప్పించుకొనుటకు సర్పమును నిందించింది. ఆదాము, కనీసం ఆ సమయములోనైనా, హవ్వను "సహాయకురాలు"గా చూడలేదు, కాని తనకు ఒక అభ్యంతరంగా ఒక అడ్డు బండగా చూసాడు. ఈ మొదటి పాపము మరియు దాని పర్యావసానము ఖచ్చితంగా కొంతమట్టుకు వారి అన్యోన్యతను దెబ్బతీసింది, ప్రాముఖ్యంగా, పరదైశును కోల్పోవుటకు ఆమే బాధ్యురాలు అని ఆదాము మరల మరల ఆమెకు జ్ఞాపకము చేసిన యెడల. ఆ తోటనుండి బయటకు తోలివేయబడిన తరువాత ఆ చెడు భావాలు ఇంకా చాలా కాలం వారితోనే ఉండి ఉంటాయి.

పాపము అనునది ప్రజలు జన్మయందు వారసత్వంగా సంక్రమించినది కాదు (4:6–8 చూడండి); కాని, దేవుని పట్ల మరియు కుటుంబ సభ్యుల పట్ల చెడ్డ ధోరణి మరియు కోపము అనేవి తల్లిదండ్రుల యొక్క మాటలు మరియు క్రియలనుండి నేర్చుకోవచ్చు. తమ పాపముల పట్ల పిల్లలకు ఉండవలసిన తమ సొంత బాధ్యతను ఈ భావన తక్కువ చెయ్యట్లేదు అనుకోండి, లేదా వారి క్రియలు తమ తల్లిదండ్రుల (లేదా దేవుని) పొరపాటు వలన అని చెప్పి ప్రతిదండనను తప్పించుకొనుటకు ఇది సహకరించదు. ఆదాము మరియు హవ్వలు కయీనునకు ఏమి నేర్పించారో లేదా తను పెరుగుతున్నప్పుడు జీవితము మరియు దేవుని పట్ల తమ వైఖరి ద్వారా కయీను ఏమి నేర్చుకున్నాడో లేఖనములు మనకు స్పష్టపరచుటలేదు.

అలాగే, హేబెలు జననమునకు ఎంత కాలం జరిగిందో మనకు తెలియదు.

చాలా సంవత్సరాలు గతించి ఉండొచ్చు, ఎందుకంటే 5:3 ప్రకారం ఆదాము షేతునకు తండ్రి అయినప్పుడు 130 సంవత్సరాల వయసు గలవాడు. హేబెలు జన్మించేసరికి ఆదాము మరియు హవ్వలు తమ వైఖరులను మరియు క్రియలను మార్చుకొని ఉండియుంటారా? అలాగైతే, మొదటి సంతానముతో పోలిస్తే రెండవ మరియు మూడవ సంతానము ఒక ప్రత్యేకమైన వాతావరణాన్ని అనుభవించి ఉంటారు, అదియు ఒకే గృహంలో. ఏది ఏమైనప్పటికీ, కయీనును హేబెలు మరియు షేతులతో పోలిస్తే చాలా వ్యత్యాసమైనవాడు. ఆయన గమ్యం దేవునిచే, తన తల్లిదండ్రులచే, లేదా తన వాతావరణముచే నిశ్చయించబడినది కాదు, ఆయనకు ఎంపికలు చేసుకొనుటకు సామర్థ్యం కలదు, ఇంకా తన తీర్మానాలకు ఆయనే బాధ్యుడు.

చిన్న కుమారుడైన హేబెలు ఎప్పుడు కూడా "మంచి బాలుడు"గా ఉన్నందున తన తల్లిదండ్రులకు బహుశా ప్రీతికరంగా ఉండి ఉంటాడు. అలాగైతే, దేవుడు తన అర్పణను అంగీకరించి కయీనును తిరస్కరించినప్పుడు, పెద్ద సహోదరుని అహము భరించగలిగినదానికంటే ఎక్కువ కష్టమైనది. కారణం ఏమైనప్పటికీ, తన తమ్ముడైన హేబెలు పట్ల కయీను ద్వేషంతో నురగలు కక్కుతున్నాడు. కయీను హృదయంలో ఏమి చోటుచేసుకుంటుందో ఎరిగిన దేవుడు కయీనుతో ఒక అడవి మృగమువలే వాకిట పాపము పొంచియుంది గనుక దానిని అధిగమించమని చెప్పాడు (4:7). అయినను, కయీను నుండి ఆశించుటకు అది చాలా ఎక్కువ ఔదార్యము అయినది. ఆయన తన కోపము మరియు పగకు అప్పగింపబడినవాడై, హేబెలును చంపి భూమిలో పాతిపెట్టాడు. దేవుడు ఆయనను ఎదుర్కొని "నీ సహోదరుడైన హేబెలు ఎక్కడ?" అని అడిగినప్పుడు ఆయన సమాధానం, "నాకు తెలియదు. నా తమ్మునికి నేను కావలివాడనా?" (4:9).

కయీను కోపము మరియు అసూయ తన సహోదరుని హత్యకు దారితీసాయి. దేవుడు తన ప్రజలనుండి ఆశించు వాటికి ఇట్టి ధోరణి పూర్తి భిన్నమైనది. యోహాను వ్రాసాడు, "మనమొకని నొకడు ప్రేమింపవలెననునది మొదటనుండి మీరు వినిన వర్తమానమేగదా, మనము కయీను వంటివారమై యుండవాడు. వాడు దుష్టుని సంబంధియై తన సహోదరుని చంపెను ..." (1 యోహాను 3:11–12). హేబెలు యొక్క ఆచూకి లేదా తన సంక్షేమాన్ని గూర్చి కయీను బాధ్యతను నిరాకరించాడు. ఆయన యొక్క పాపపూరితమైన, అహముతో నిండిన హృదయము తన మనసాక్షినుండి తన క్రియలను విభజించింది, అదియు విషాదకరమైన ఫలితాలతో: తన సహోదరుని నిష్కపటపు జీవితాన్ని యదేచ్చగా తీసుకోవడానికి దారితీసింది.

*ఒకని కుటుంబము మరియు సమాజము నుండి యెడబాటు.* తన సహోదరుని క్రూరమైన హత్య చేయడం ద్వారా కయీను తన తండ్రికి తన తల్లికి

కలిగించిన బాధను మనము ఊహించుకోగలము. మూడవ అధ్యాయము సహజమైన పరిశుద్ధత నుండి మానవుడు పడిపోవుటను తెలిపితే, నాల్గవ అధ్యాయము ఒక కుటుంబము దేవుడు ఏర్పరచిన ప్రణాళిక నుండి పడిపోవడాన్ని తెలుపుతుంది. మరియెన్నడు తీసివేయలేనంతగా ఈ హత్య ఒక కొయ్యను కుటుంబం లోనికి దిగవేసింది. కయీను ఒక క్రూరమైన అవివేకమైన హత్య చేసాడు; ఇంకా దానిపట్ల ఆయన ఎటువంటి పశ్చాత్తాపము చూపలేదు, కాబట్టి ఆ ఇంటిలోనే ఉండుటకు అనుమతించబడుటకు ఆయన చాలా భయంకరమైనవానిగా స్పష్టంగా కనబడుచున్నాడు. కయీను చావవలసియున్నది, కాని దేవుడు కరుణతో ఒక దిమ్మరిగా, సంచారిగా జీవించుటకు అనుమతించాడు. ఆయన తన కుటుంబముతో సమాధానంగా జీవించలేకపోతే, అతడు ఆ కుటుంబమునకు వేరుగానే జీవించవలసియున్నది.

తను బయటకు తోలివేయబడతాడని ఒక దైవిక తీర్పును కయీను విన్నప్పుడు, ఆయన అనుమానాస్పదంగా భావించి తనను ఎవరైనా కనుగొంటే చంపేస్తారని దేవునికి ఫిర్యాదు చేసాడు (4:14). నీతిగల తన సహోదరుని కయీను హత్యచేసినప్పటికీ, తన నేరమును బట్టి దేవుడు తనను ఎత్తడానికి ప్రతివిధమైన హక్కు ఉన్నప్పటికీ, తనను బ్రతికించుటలో దేవుడు చూపిన కరుణకు అతడు ఎటువంటి అభినందనను చూపలేదు. తను హానిపరచబడకుండా దేవుడు తనకిచ్చిన రక్షణ సూచనను బట్టి ఆయన దేవునికి కృతజ్ఞుడిగా లేడు. నిజానికి, ఈ భూమిపై ఒక సంచారపు జీవితానికి అప్పగించుటలో చాలా కఠినంగా వ్యవహరించిన దేవుని ఆయన నిందించాడు. కయీను హృదయమును ఏది కూడా మృదువు పరచలేదు, లేదా తనను పశ్చాత్తాపమునకు నడిపించలేదు. తన జీవితమంతటిలో తనను తానూ ఒక బాధితునిగా పరిగణించి, దేవుడు మరియు మానవులు తనకు ఏదో ద్రోహం చేసారని భావించి వారిపై వైరభావాన్ని పెంచుకున్నాడు.

ఇట్టి పగతీర్చుకొనెడు వైఖరినే కయీను వారసత్వంగా తన తరువాతి సంతానమునకు అందించాడు, లెమెకు తను ఒక పడుచువానిని హత్యచేశాడని చెప్పుకుంటున్న డంబపు మాటల్లో ఇది తేటతెల్లమౌతుంది (4:23, 24). ఒక పాపి తన పాపమును గుర్తించకుండా, తన క్రియలకు బాధ్యత వహించకుండా ఉంటే, దాని పర్యావసానాలు తరతరములవరకు ఉండగలవు.

*దేవుని యొద్ద నుండి యెడబాటు.* తోటలో ఆదాము మరియు హవ్వలు పాపము చేసినప్పుడు, ఆత్మీయ యెడబాటు సంభవించింది; వారు దేవుని యొద్ద నుండి వైదొలగారు. ఆయన సన్నిధికి వారు భయపడి ఆయననుండి దాగుకొనుటకు ప్రయత్నించారు. అలానే కయీను కూడా: తన నేరమును బట్టి మరియు దానికి ఆయన పొందవలసిన ప్రతిదండనతో దేవుడు ఆయనను ఎదుర్కొనినప్పుడు, ఆయన దేవుని "ముఖము" నుండి ఈ లోకంలో ఒక దిమ్మరి

మరియు సంచారకుని వలె దాచబడాలని ఆయన ఫిర్యాదు చేసాడు (4:14). వాక్యము చెప్తుంది, "అప్పుడు కయీను యెహోవా సన్నిధిలోనుండి బయలుదేరివెళ్లి ఏదెనుకు తూర్పుదిక్కున నోదు [సంచారము చేయుట] దేశములో కాపురముండెను" (4:16). (ఈ వాక్యంలో రెండు పదాలు, "ముఖము" మరియు "సన్నిధి," ఒకే హెబ్రీ పదమునుండి פָּנִים [*panim*] అనువదించబడినవి).

4:14, 16 వచనాలలోని భాష భౌతికపరమైన దూరాన్ని సూచిస్తుంది, ఎందుకటే కయీను ఏదెను తోట నుండి ఇంకా ఎక్కువ దూరము వెళ్ళిపోయాడు గనుక. ఈ భౌతిక దూరము అనునది దేవునిపై తిరుగుబాటు చేయుటవలన ఒక వ్యక్తి దైవిక అనుగ్రహం కోల్పోవడాన్ని (యోబు 13:24; కీర్తనలు 13:1; 44:24; 88:14; 132:10) తద్వారా ఏర్పడిన ఆత్మీయ యెడబాటుకు సాదృశ్యంగా ఉంది. కయీను పాపము వలన, ఆయన దేవుని "ముఖము" లేదా "సన్నిధి" నుండి తిరిగి వెళ్ళిపోయాడు.

ఒక పాపి పశ్చాత్తాపపడినప్పుడు, దేవుని కృప మరియు క్షమాపణను వెదకినప్పుడు, మరియు తిరిగి చేర్చబడినప్పుడు –దేవుని ముఖము వారిపై మరలా "ప్రకాశించు"నని చెప్పబడింది (కీర్తన 80:19 చూడండి). ఇంకొక విధంగా చెప్పాలంటే, ఈ యెడబాటు (పరాయత్వము) తొలగిపోయి, సదరు వ్యక్తి మరల దేవుని అనుగ్రహాన్ని మరియు ఆశీర్వాదాలను అనుభవిస్తాడు (సంఖ్యా. 6:24–27; కీర్తనలు 4:6; 44:3; 80:3, 7, 19; 89:15).

కయీను అనుభవించిన ఈ యెడబాటు (లేదా పరాయత్వము) తన మొండిదైన, పశ్చాత్తాపపడనీ వైఖరి వలన కలిగినది. విధేయతతో తనవైపు తిరుగు పాపులను అంగీకరించుటకు మరియు క్షమించుటకు దేవుడు ఎల్లప్పుడు సిద్ధంగా ఉన్నాడు. పౌలు ఒక సమయాన యేసును ద్వేషించి క్రైస్తవులను హత్యచేసాడు (1 తిమోతి 1:12–16). పెంతెకోస్తు దినమున మారుమనస్సు పొందిన అనేకమంది యూదులు యేసు యొక్క సిలువను (హత్యను) గురించి కేకలువేసిన వారే (అపొ. 2:22, 23, 36–41). కొంతమంది క్రైస్తవులు విగ్రహారాధనలో మరియు అన్యజనుల దుష్టత్వములో మునుపు జీవించినవారే (అపొ. 26:17, 18; ఎఫెస్సీ 2:11–16). అయినప్పటికీ వీరు పశ్చాత్తాపపడ్డారు, దేవుడు వారిని క్షమించాడు. కయీను తన శేషజీవితమంతా దేవుని సన్నిధికి మరియు దేవుని "ముఖము" ఆయనపై మరలా ప్రకాశించకుండా దూరంగా గడిపాడు. అంటే, దానికి కారణము ఆయనలోని మొండి గర్వం. కఠినమైన కయీను హృదయము దేవుడు ఆశించి యివ్వాలనుకున్న రక్షణ మరియు ఆశీర్వాదములను అతడు పొందకుండునట్లు చేసెను.

## “యెహోవా నామము” (4:26)

ఆదికాండము 4:26; 12:8; మరియు 26:25లో ప్రజలు “యెహోవా నామము” పేరిట ప్రార్థన చేసినట్లుగా చెప్పబడింది.

వ్యక్తులు “యెహోవా నామము (יהוה, *YHWH*),” లేదా “యెహోవా,” పేరిట ప్రార్థన చేసారు అని తెలియజేసే ఆదికాండములోని వాక్యభాగాలు నిర్గమకాండము 6:3లోని వాక్యాలతో విబేధిస్తున్నాయని విమర్శకులు అంటారు. ఆ వాక్యభాగంలో, “నేను సర్వశక్తి గల దేవుడను పేరున అబ్రాహాము ఇస్సాకు యాకోబులకు ప్రత్యక్షమైతిని కాని, యెహోవా అను నా నామమున నేను వారికి తెలియబడలేదు” అని దేవుడు అన్నాడు. ఈ వాదములో ముందుగా కొంచెం అర్థం ఉన్నట్టుంది. అయినను, నిర్గమములోగల శక్తివంతమైన విమోచనా క్రియలలో, దేవుడు తన వ్యక్తిగత పేరు యొక్క అర్థము ద్వారా మోషేకు మరియు ఇశ్రాయేలునకు తన విశిష్టమైన స్వభావాన్ని బయలుపరచాడు. మొదటగా, ఆయన మోషేకు తన పేరు “ఉన్నవాడను”గా (హెబ్రీలోని “అయి ఉన్నాడు” అను క్రియారూపానికి ఇది ప్రథమా విభక్తి ప్రత్యయము (הָיָה, *hayah*); నిర్గమ. 3:14 చూడండి) ఇవ్వమన్నాడు. ఇశ్రాయేలీయులు తనను జీవముగల దేవునిగా, మరియు ఐగుప్తు దేవుళ్లవలే గాక ఉనికి మరియు మనుగడ కలిగిన దేవునిగా తెలుసుకోవాలని దేవుడు అనుకున్నాడు. రెండవదిగా, “యెహోవా” అను పదము హెబ్రీ పదమైన “అయి ఉన్నాడు” అను క్రియారూపమునకు కారకరూపము అయి ఉండవచ్చు, అంటే అర్థము దేవుడు కేవలం “ఉన్నవాడు” అనిమాత్రమే కాదు గాని, “క్రియలు జరుగడానికి కారకుడైన” దేవుడుగా కూడా ఉండగలడు అని. తన ప్రజలను విడిపించు నిమిత్తం ఆయన చరిత్రలో క్రియ చేయగలిగిన దేవుడు కూడా. ఈ విషయాన్ని ఆయన త్వరలోనే ఐగుప్తు దేవుళ్లను పది తెగుళ్లతో ఓడించుటద్వారా వెల్లడిచేయబోతున్నాడు, అదే విధంగా ఇశ్రాయేలీయులు తప్పించుకొనుటకు గాను ఎర్ర సముద్రమును చీల్చుట ద్వారా మరియు వారిని సురక్షితంగా వాగ్దాన దేశానికి తెచ్చుట ద్వారా కూడా వెల్లడించాడు.

మోషే సందేశమును ఇశ్రాయేలీయులు నమ్ముటకు, అతనిని ఐగుప్తుకు తిరిగి పంపిన దేవుడు పితరుల యొక్క దేవుడే అని ప్రకటించుట ఏకైక మార్గము అని అనిపిస్తుంది. “యెహోవా” అను పేరు ప్రజల యొక్క జ్ఞాపకాలను వెలికితీసి, ఇశ్రాయేలు పట్ల ఆయన ప్రేమను మరియు ఐగుప్తు పట్ల ఆయన శక్తిని చూపించాలని వారు దేవుని కొరకు ఎదురుచూచుచుండగా ఇది వారికి భవిష్యత్తును గూర్చిన నిరీక్షణను ఇస్తుంది.

దేవుడు మోషేకు ఉపదేశించాడు, “మరియు దేవుడు మోషేతో నిట్లనెను మీ పితరుల దేవుడైన యెహోవా, అనగా అబ్రాహాము దేవుడు ఇస్సాకు దేవుడు యాకోబు దేవుడునైన యెహోవా మీ యొద్దకు నన్ను పంపెనని నీవు

ఇశ్రాయేలీయులతో చెప్పవలెనిరంతరము నా నామము ఇదే, తరతరములకు ఇది నా జ్ఞాపకార్థక నామము" (నిర్గమ. 3:15). దేవుడు మోషేకు మరియు ఇశ్రాయేలుకు బయలుపరస్తుంది క్రొత్త నామము కాదు; కాని అది "యెహోవా" అనే పదమునకు ఒక నూతన గుణింతము లేదా ఉచ్ఛరణను ఇస్తున్నాడు. మొట్టమొదటిసారి, తన పేరుద్వారా తెలియపరచబడిన స్వభావము మరియు గుణమునకు ఒక అంతఃదృష్టిని ఇస్తున్నాడు. ఈ విధంగా, పితరులు మునుపు ఇవ్వబడిన దానికంటే దేవుడు మోషేకు తనను గూర్చి మరి ఎక్కువ అర్థాన్ని అందిస్తున్నాడు.

## పాపము మరియు రక్షణ

కయీను వలె, ఆదాము మరియు హవ్వల వలె, ప్రజలందరూ పాపము చేసారు; కాని క్రీస్తు యేసులో పాపక్షమాపణ మరియు విమోచన లభ్యమౌతున్నాయి (రోమా 3:23, 24). యేసు "పాపములను తీసివేయుటకై ప్రత్యక్షమాయెను; ఆయనయందు పాపమేమియు లేదు" (1 యోహాను 3:5). ఎవరైతే "క్రీస్తులో" ఉండి నిత్యజీవాన్ని పొందాలనుకుంటారో ఆయనను మన పాపము కొరకు పరిహారాన్ని చేయడానికి, లేదా క్రయధనముగా ఉండడానికి (1 యోహాను 2:2; 4:10; రోమా 3:25 చూడండి; NIV) ఈ లోకములోనికి పంపబడిన దైవిక దేవుని కుమారునిగా (1 యోహాను 5:13) నమ్మాలి. "లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిపొందెను" (1 కొరింథీ 15:3), మనము "పాపముల విషయమై చనిపోయి, నీతివిషయమై జీవించునట్లు" (1 పేతురు 2:24) ఆజ్ఞాపించబడియున్నాము. ఇది పశ్చాత్తాపమును కోరుతుంది (అపొ. 2:38; 17:30).

మునుపు చేసిన పాపములను తొలగించుకొనుటకు ఏకైన మార్గము వాటిని బాప్తిస్మము అనే క్రియ ద్వారా (అపొ. 22:16) ప్రక్షాళన చేసుకోవడం. హెబ్రీ పత్రిక 9:22 అంటుంది "రక్తము చిందింపకుండ పాప క్షమాపణ కలుగదు" అని, కాని ఆ వాక్యము ఇంకా ముందుకు వివరిస్తూ యేసు "పాపముల నిమిత్తమై సదాకాలము నిలుచు ఒక్క బలిని అర్పించాడు" (హెబ్రీ. 10:12). "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమి" (రోమా 6:3) గనుక, "ఆయన రక్తమువలన మనకు విమోచనము" (ఎఫెసీ. 1:7) ఉంది. క్రైస్తవులు–అనగా క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన వారు– "పాపము విషయమై మృతులుగాను, దేవుని విషయమై క్రీస్తుయేసు నందు సజీవులు" (రోమా 6:11) మరియు "నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు" (రోమా 6:4) అవకాశము కలిగియున్న వారు.

సూచనలు

[1]Leonard J. Coppes, “קַיִן,” in *TWOT*, 2:797–98. [2]John E. Hartley, *Genesis*, New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 2000), 79. [3]“Targum of Onkelos,” in *The Targums*, trans. J. W. Etheridge (New York: KTAV Publishing House, 1968), 42. [4]Walter C. Kaiser, Jr., *Toward an Old Testament Theology* (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1978), 37. [5]“Targum of Palestine,” in *The Targums*, 170. [6]Victor P. Hamilton, “הֶבֶל”, in *TWOT*, 1:204–5. [7]“హెబెలు” అను పదమునకు అర్థమును గూర్చి మరికొంత సూచనలు ఇవ్వబడినవి. కొంతమంది ఈ పదము అక్కేడియన్ల పదమైన *aplu*, నుండి సంగ్రహించబడిందని అంటారు, దాని అర్థము “కుమారుడు” లేదా “వారసుడు.” మరికొంత మంది, ఇది “యాబాలు” అను పదమునకు వేరు రూపము, దీనికి అర్థము “కాపరి” లేదా “కాయువాడు” అంటారు (4:20 చూడండి). అయినప్పటికీ, హెబెల్ అను ఈ పదమును “ఆవిరి” లేదా “ఊపిరి”గా అర్థం చేసుకోవడం మంచిది (Richard S. Hess, “Abel,” in *The Anchor Bible Dictionary*, ed. David Noel Freedman [New York: Doubleday, 1992], 1:10). [8]తరువాత, మందలను కాయడం అనునది యాకోబు (30:36), మోషే (నిర్గమ. 3:1), మరియు దావీదు (1 సమూ. 16:11) అనబడు సుప్రసిద్ధ వ్యక్తుల వృత్తి అయినది. [9]కయీను తన తండ్రియైన ఆదాము యొక్క వృత్తిని అనుసరించాడు (3:17–19). [10]లేవీయకాండము 2 (మరియు ఇతర వాక్యభాగాలలో), KJV మిన్హా ను “మాంసపు అర్పణ”గా పొరపాటుగా అనువదిస్తుంది. అయితే సందర్భం స్పష్టంగా చెప్పే “గోధుమ అర్పణ” అనే అనువాదం సరైనది (NKJV; NASB; NRSV; ESV లో చూడండి).

[11]ఈ పదమునకు మామూలు అర్థము “పండుకొని యుండుట,” ముఖ్యంగా సాధుపరచబడిన జంతువుల విషయంలో వాడబడేది (ఆది. 29:2; కీర్తన 23:2; యెష. 13:20; 14:30; యెహెజ్కేలు 34:14); అయినను, ఆదికాండము 4:7 మరియు 49:9లో, ఇది “దూకుటకు సిద్ధంగా ఉన్న ఒక క్రూరమైన జంతువు,” అనే అర్థాన్నిచ్చునట్లుగా మరియు అలంకారంగా ఉపయోగపడబడులాగున ఉంది. (William White, “רָבַץ,” in *TWOT*, 2:830.) [12]John E. Hartley, “שָׁמַר” in *TWOT*, 2:939–40. [13]తనపై వచ్చిన అన్ని శ్రమలలో సాతానుయొక్క ప్రమేయాన్ని యోబు తెలియకయున్నాడు, కాబట్టి ఆయన తన ఉపద్రవమునకు దేవునే బాధ్యునిగా ఎంచి నిందించాడు. ఉదాహరణకు, యోబు 16:12,13 లో, తనను ఒక “గురి”గా చేసుకుని తనపైకి “బాణాలను” సంధిస్తున్నందుకు దేవుని కరుణలేనివాడిగా, “తుండ్లను పొడిచి” తెరిచినట్లుగా మరియు “పైత్యరసమును నేలకు పారబోసిన” వాడిగా భావించాడు. ఈ పుస్తకములో ఇలానే అనేక ఆరోపణలు చేయబడినవి. [14]Kenneth A. Mathews, *Genesis 1–11:26*, The New American Commentary, vol. 1A (Nashville: Broadman & Holman Publishers, 1996), 277. [15]Elmer B. Smick, “נָקַם” in *TWOT*, 2:598–99. [16]Helmer Ringgren, “נוּד,” in *Theological Dictionary of the Old Testament*, trans. David E. Green, ed. G. Johannes Botterweck, Helmer Ringgren, and Heinz-Josef Fabry (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1998), 9:271. נוּד (*nud*) అను క్రియా రూపము “స్థిరత్వములేని దేశ సంచారిని” కూడా సంభోదిస్తుంది. [17]Mathews, 285. [18]John E. Hartley, “צֹאן,” in *TWOT*, 2:749. [19]Gordon J. Wenham, *Genesis*

*1–15*, Word Biblical Commentary, vol. 1 (Waco, Tex.: Word Books, 1987), 113. [20]Ludwig Koehler and Walter Baumgartner, *The Hebrew and Aramaic Lexicon of the Old Testament*, study ed., trans. and ed. M. E. J. Richardson (Boston: Brill, 2001), 1:528.

[21]Ibid., 1:691. [22]Gerhard F. Hasel, "Iron," in *The International Standard Bible Encyclopedia*, rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1982), 2:880. [23]కొన్ని అనువాదాలలో "నేను చంపుతాను/హతమారుస్తాను" అనే పదము పర్యాయపదముగా సూచనల్లో ఇవ్వబడింది (ASV; NIV); "నేను చంపాను" అనే అనువాదం NEB మరియు REB లలో ఉంది. [24]KJV; NKJV; ASV; RSV; NRSV; NAB; JB; NJB; NIV; NJPSV; TEV; NLT; NCV; CEV; ESV లలో చూడండి. [25]KJV; NKJV; ASV; RSV; NRSV; NEB; REB; NIV; TEV; NLT; NCV; CEV; ESV లలో చూడండి. పాత నిబంధనలో yeled అనే పదము చాలా వయసులవారికి ప్రయోగించబడింది, పసిబాలురు (21:8); యౌవనస్థుడు (21:16); పడుచువారు (1 రాజులు 12:8) అనే వారికి కూడా. [26]ఈ విధమైన స్వయం – కేంద్రీకృతం మరియు పునీతునిగా భావించే భావం క్రీస్తు తన ప్రజలలో నుండి ఆశించే దానికి పూర్తి విరుద్ధంగా ఉంది. మత్తయి 18:21, 22 లో ఆయన పేతురుతో తనకు విరోధముగా పాపము చేసినవానిని "డెబ్బది సార్లు ఏడు" లేదా "డెబ్బది ఏడు" సార్లు క్షమించమని చెప్పాడు (NIV). [27]Wenham, 116.